

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY



ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి
రి.నెం. 119/2015
ఆళ్ళగడ్డ, కర్నూలు జిల్లా
ఉచిత కళ్యాణ మండపం
స్వయం ఉపాధి శిక్షణ
ఉచిత రక్తదానము
ఉచిత న్యాయ సలహాలు
ఉచిత కంప్యూటర్ శిక్షణ
సంప్రదించవలసిన చిరునామా
ఆవుల విజయభాస్కర రెడ్డి
B.A.L.L.B
ఆళ్లగడ్డ
9440232308,9494498787



PUBLISHED FROM KURNOOL ఎడిటర్: ఆవుల విజయ భాస్కర రెడ్డి బుధవారం 08-06-2022 సంపుటి : 03 సంచిక : 259 పేజీలు : 4 వెల : రూ 3-00


# బాబు హయాంలో ట్రాక్టర్ల కుంభకోణం

## మంత్రులు, చంద్రబాబు కలసి స్కామ్‌కు పాల్పడ్డారు

## వైఎస్సార్ యంత్రసేవా పథకం ప్రారంభించిన సిఎం జగన్







గుంటూరు,జూన్7: గతంలో చంద్రబాబునాయుడు హయాంలో అరకొర ట్రాక్టర్లు ఇచ్చారని, అవి కూడా రైతులు ఎవరూ కూడా వాళ్లు ట్రాక్టర్ల ఆర్డర్లు ప్లేస్ చేయలేదని సిఎం జగన్ అన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, చంద్రబాబునాయుడు అంతా కలిసికట్టుగా ట్రాక్టర్ల డీలర్లతో స్కామ్‌లు చేశారని ఆరోపించారు. అప్పటికీ ఇప్పటికీ తేడాను గమనించండి. ఈ రోజు ట్రాక్టర్ దగ్గర నుంచి ఏ పనిముట్టు కావాలన్నా నేరుగా రైతు ఇష్టానికి వదిలిపెట్టాం. రైతు ఏ ట్రాక్టర్‌నైనా తనకు నచ్చిన కంపెనీ, తనకు నచ్చిన పనిముట్టు తానే ఆర్డర్ ప్లేస్ చేస్తాడు. సబ్సిడీ ప్రభుత్వం రైతుకు ఇస్తుందన్నారు. వైఎస్సార్ యంత్రసేవా పథకం రాష్ట్రస్థాయి మెగా పంపిణీలో భాగంగా 3800 ఆర్బీకే స్థాయి యంత్రసేవా కేంద్రాలకు 3,800 ట్రాక్టర్లు, 320 క్లస్టర్ స్థాయి యంత్ర సేవా కేంద్రాలకు 320 కంబైన్ హార్వెస్టర్ల పంపిణీ జరిగింది. గుంటూరులో రాష్ట్ర స్థాయి మెగా పంపిణీని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. 5,260 రైతు గ్రూపు బ్యాంకు ఖాతాలకు రూ.175 కోట్ల సబ్సిడీని సీఎం జమ చేశారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ రోజు గొప్ప కార్యక్రమం జరుగుతుంది. ప్రతి గ్రామంలోనూ విత్తనం నుంచి పంట అమ్మకం వరకు ప్రతి దశలోనూ రైతుకు తోడుగా ఉండేందుకు రైతు భరోసా కేంద్రాలను ప్రతి గ్రామంలోనూ నిర్మించాం. ఆర్బీకేలు ప్రతి అడుగులోనూ రైతుకు తోడుగా ఉంటూ.. విత్తనం సరఫరా నుంచి పంట కొనుగోలు వరకూ తోడుగా నిలబడుతున్నాయి. రైతు భరోసా కేంద్రాలలో వ్యవసాయం ఇంకా మెరుగుపర్చేందుకు, రైతుకు కావాల్సిన పనిముట్లన్నీ కూడా ఆ రైతు భరోసా కేంద్రాల్లోనే, అదే గ్రామాల్లోనే తక్కువ ధరలోనే వారికి అందుబాటులో వచ్చేందుకు రైతులతోనే గ్రూపులు ఏర్పాటు చేసి ఆ రైతులకే ప్రభుత్వం తరపున 40 శాతం రాయితీ ఇస్తున్నాం. మరో 50 శాతం రుణాలు తక్కువ వడ్డీకే బ్యాంకులతో మాట్లాడి మంజూరు చేయిస్తున్నాం. రైతులు గ్రూపులుగా ఏర్పడి కేవలం 10 శాతం డబ్బులు కడితే చాలు.. వాళ్లకు గ్రామంలో వ్యవసాయానికి ఉపయోగపడే ట్రాక్టర్లతో సహా ఉపకరణాలన్నీ కూడా ఆర్బీకే పరిధిలోనే సరసమైన ధరలకే అందుబాటులో ఉంచే గొప్ప కార్యక్రమానికి ఇవాళ శ్రీకారం చుట్టామన్నారు. ఇందులో భాగంగానే ఈరోజు రూ.2016 కోట్లతో ప్రతి ఆర్బీకే స్థాయిలోనూ రూ.15 లక్షలు విలువగల 10,750 వైఎస్సార్ యంత్రసేవా కేంద్రాలను స్థాపించే కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నాం. ఇవి కాక వరి ఎక్కువగా పండించే 20 జిల్లాల్లో ఒక్కొక్కటి రూ.25 లక్షలు విలువ గల కంబైన్ హార్వెస్టర్లతో కూడిన 1615 క్లస్టర్ స్థాయి యంత్రసేవా కేంద్రాలను కూడా ఏర్పాటు చేయబోతున్నాం. ఆర్బీకే స్థాయి యంత్రసేవా కేంద్రాలకు 3800 ట్రాక్టర్లను అందజేస్తున్నాం. రాబోయే రోజుల్లో 10,750 రైతు భరోసా కేంద్రాలన్నింటికీ కూడా ఈ సేవలన్నీ విస్తరిస్తాయి. అందులో భాగంగా ఈ రోజు 3,800 ట్రాక్టర్లతో పాటు 1140 ఆర్బీకే స్థాయి యంత్ర సేవా కేంద్రాలకు ఇతర వ్యవసాయ యంత్రపరికరాలను కూడా అందిస్తున్నాం. క్లస్టర్ స్థాయి యంత్రసేవా కేంద్రాలకు 320 కంబైన్ హార్వెస్టర్ల పంపిణీ కూడా జరుగుతుంది. 5,260 రైతు గ్రూపుల బ్యాంకుల ఖాతాల్లోకి రూ.590 కోట్లు విలువచేసే సామాన్లుకు సంబంధించిన.... రూ.175 కోట్ల సబ్సిడీని కూడా ఈ కార్యక్రమంలోనే వారి ఖాతాల్లోకి బటన్ నొక్కి జమ చేస్తున్నామని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నేడు పంపిణీ చేస్తున్న వ్యవసాయ యంత్రపరికరాలన్నీ కలిపి ఇప్పటికి 6780 ఆర్బీకేల్లోకి, మరో 391 క్లస్టర్ స్థాయి కమ్యూనిటీ హైరింగ్ సెంటర్లకు దాదాపు రూ.700 కోట్ల విలువ గల ట్రాక్టర్లు, కంబైన్ హార్వెస్టర్లు, ఇతర వ్యవసాయ పనిముట్లను పంపిణీ చేసినట్లవుతుంది. రాబోయే రోజుల్లో సంవత్సరం తిరక్క మునుపే రూ.2016 కోట్ల విలువ చేసే వ్యవసాయ పరికరాలను ఆర్బీకేల పరిధిలో రైతుల చేతుల్లో పెట్టబోతున్నాం. ఇవన్నీ దేవుడి చల్లని దీవెనలు, మీ అందరి చల్లని ఆశీస్సులతోనే సాధ్యమైంది. ఇంకా ఎక్కువ మంచి చేసే అవకాశం దేవుడు ఇవ్వాలని మనసారా కోరుకుంటూ... మంచి కార్యక్రమానికి శ్రీకారం చుదుతున్నట్లు వెల్లడించారు. ఇక చిన్న తేడాను గమనించమని ప్రతి రైతన్నను కోరుతున్నాను. ఇదే కార్యక్రమంలో భాగంగా గతంలో చంద్రబాబునాయుడు హయాంలో అరకొర ట్రాక్టర్లు ఇచ్చారు. అవి కూడా రైతులు ఎవరూ కూడా వాళ్లు ట్రాక్టర్ల ఆర్డర్లు ప్లేస్ చేయలేదు. మంత్రులు, ఎమ్మెల్యేలు, చంద్రబాబునాయుడు అంతా కలిసికట్టుగా ట్రాక్టర్ల డీలర్లతో స్కామ్‌లు చేశారు. అప్పటికీ ఇప్పటికీ తేడాను గమనించండి. ఈ రోజు ట్రాక్టర్ దగ్గర నుంచి ఏ పనిముట్టు కావాలన్నా నేరుగా రైతు ఇష్టానికి వదిలిపెట్టాం. రైతు ఏ ట్రాక్టర్‌నైనా తనకు నచ్చిన కంపెనీ, తనకు నచ్చిన పనిముట్టు తానే ఆర్డర్ ప్లేస్ చేస్తాడు.

సబ్సిడీ ప్రభుత్వం రైతుకు ఇస్తుందన్నారు. ఇందులో భాగంగానే ఇవాళ రూ.175 కోట్లు రైతుల ఖాతాల్లోకి జమ చేస్తున్నాం. అవినీతి లేకుండా ఏ రకంగా వ్యవస్థను క్లీన్ చేస్తున్నామో.. గమనించండి. గత ప్రభుత్వానికి ఇప్పటికీ తేడా చూడండి. ఇవాళ 175 ట్రాక్టర్ల మోడళ్లలో రైతులకు నచ్చిన మోడల్ కొనుగోలు చేసే అవకాశం ఇచ్చాం అని సీఎం జగన్ తన ప్రసంగం ముగించారు. అనంతరం రూ.175 కోట్ల సబ్సిడీ అమౌంట్‌ను కంప్యూటర్‌లో బటన్ నొక్కి నేరుగా రైతు గ్రూపుల ఖాతాల్లోకి జమ చేసిన సీఎం జగన్, వైఎస్సార్ యంత్రసేవా పథకంలో భాగంగా రాష్ట్ర స్థాయి మెగా పంపిణీని జెండా ఊపి ప్రారంభించారు. వైఎస్సార్ యంత్ర సేవా పథకం ప్రారంభ కార్యక్రమంలో ఆసక్తికర ఘటన చోటుచేసుకుంది. రైతు గ్రూపుతో కలిసి సీఎం వైఎస్ జగన్ స్వయంగా ట్రాక్టర్‌ను నడిపారు. గుంటూరు జిల్లాలోని చుట్టగుంట వద్ద 'వైఎస్సార్ యంత్ర సేవ పథకం' రాష్ట్రస్థాయి మెగా మేళాలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. రైతు గ్రూపులకు మంజూరైన ట్రాక్టర్లు, కంబైన్డ్ కోత యంత్రాల పంపిణీ కార్యక్రమాన్నిజెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఒక రైతు గ్రూపుతో కలిసి సీఎం జగన్ స్వయంగా ట్రాక్టర్‌ను నడిపారు. ఆ సమయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ ఎంవీయస్ నాగిరెడ్డి సీఎంతో ఉన్నారు. ఇదిలా ఉంటే, రాష్ట్రవ్యాప్తంగా 3,800 ట్రాక్టర్లు, 320 కంబైన్డ్ కోత యంత్రాల పంపిణీతోపాటు 5,262 రైతు గ్రూపు బ్యాంక్ ఖాతాలకు రూ.175.61 కోట్ల సబ్సిడీని సీఎం బటన్ నొక్కి జమ చేశారు.

# ఏపీ మంత్రి అంబటిని అరెస్ట్ చేయండి..

## సీఐడీ డీఐజీకి దేవినేని ఉమా ఫిర్యాదు



అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఫేక్ ట్వీట్‌ల రచ్చ కొనసాగుతున్నది. వారం క్రితం టీడీపీ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య పేర్లతో ట్వీట్‌లు వైరలయ్యాయి. తాజాగా మాజీ మంత్రి దేవినేని ఉమా పేరుతో ట్వీట్లు రావడం మొదలయ్యాయి. దేవినేని ఉమా రంగంలోకి దిగి సీఐడీకి ఫిర్యాదు చేశారు. తన పేరుతో ఫేక్ ట్వీట్ చేస్తున్న వారిపై తగు చర్యలు తీసుకోవాలని ఏపీ సీఐడీ డీఐజీ సునీల్ నాయక్‌ను మంగళవారం కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేశారు.తన పేరుతో వచ్చిన నకిలీ ట్వీట్లను ఏపీ మంత్రి అంబటి రాంబాబు ప్రచారం చేస్తున్నారని, అంబటి రాంబాబుపై తక్షణమే కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని మాజీ మంత్రి దేవినేని ఉమా పోలీసులను కోరారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను విమర్శిస్తూ తాను ట్వీట్ చేసినట్లుగా ఒక నకిలీ ట్వీట్ వైరల్ చేసినట్లు దేవినేని ఉమా తెలిపారు. వారం క్రితం వర్ల రామయ్య, గోరంట్ల బుచ్చయ్య చౌదరిలపై కూడా ఇలాంటి నకిలీ ట్వీట్లు పెట్టి వేధించారని గుర్తు చేశారు. చివరకు చంద్రబాబు సంతకం, లెటర్ హెడ్‌ను కూడా ఫోర్జరీ చేశారని తన ఫిర్యాదులో పేర్కొన్నారు.ఈ సందర్భంగా దేవినేని ఉమా మీడియాతో మాట్లాడారు. బాధ్యత గల మంత్రి పదవిలో ఉన్న అంబటి రాంబాబు ఫేక్ ట్వీట్‌ను సమర్థిస్తూ ట్వీట్ చేశారంటే అందులో కుట్రకోణం దాగిఉన్నదని అర్థమవుతున్నదని చెప్పారు. కులాలు, మతాల మధ్య చిచ్చుపెట్టేందుకు ఫేక్ ట్వీట్లను షేర్ చేస్తుండటానికి సీఎం జగన్ బాధ్యత వహించి ఏపీ రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలని దేవినేని ఉమా డిమాండ్ చేశారు.

# 25న సీబీఐటీలో మెగా జాబ్‌మేళా



చాపాడు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 25న స్థానిక చైతన్య భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ)లో 100 ప్రముఖ కంపెనీలతో మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నారు. సోమవారం సీబీఐటీ కాలేజీలో కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి జాబ్‌మేళా నిర్వహణకు స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఇప్పటికే గుంటూరు, తిరుపతి, వైజాగ్ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున జాబ్ వేళా నిర్వహించామన్నారు. ఈక్రమంలో జిల్లా ప్రజల కోసం సీబీఐటీలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 11న రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి ఆధ్వర్యంలో మెగాజాబ్ మేళా పోస్టర్‌ను ఆవిష్కరిస్తామన్నారు. మేళాలో ఆయా కంపెనీలకు చెందిన 300 మంది హెచ్‌ఆర్‌లు తమ ప్రతినిధులతో పాల్గొని ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థుల అర్హతలను బట్టి ఉద్యోగ ఎంపిక పడతారన్నారు. అభ్యర్థులు వెబ్‌సైట్‌లో తమ పేర్లు నమోదు చేసుకుని డైరెక్ట్‌గా జాబ్‌మేళాలో పాల్గొనవచ్చన్నారు. ఈ అవకాశాన్ని జిల్లా నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సీబీఐటీ కరస్పాండెంట్ వి.జయచంద్రారెడ్డి, ప్రిన్సిపాల్ డా.జి.శ్రీనివాసులరెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సంబటూరు ప్రసాద్‌రెడ్డి, మండల అధ్యక్షులు తెలిదేల లక్షుమయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు నారాయణరెడ్డి పాల్గొన్నారు.

# ఏపీలో ఈ నెల 20 నుంచి అసెంబ్లీ సమావేశాలకు కసరత్తు




అమరావతి: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ నెలాఖరులో అసెంబ్లీ సమావేశాలు నిర్వహించేందుకు కసరత్తు చేస్తున్నట్లుగా తెలుస్తున్నది. 20 వ తేదీ నుంచి వారం పాటు ఈ సమావేశాలు జరిపేందుకు అంతా సిద్ధం చేస్తున్నారు. ఇదే సమయంలో అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ మార్పు కూడా జరిగే అవకాశం ఉన్నట్లుగా తెలుస్తున్నది. అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ పదవికి కోన రఘుపతి రాజీనామా చేయనున్నారని, కొత్త డిప్యూటీగా కోలగట్ల వీరభద్ర స్వామి ప్రమాణ స్వీకారం చేస్తారని సమాచారం. అసెంబ్లీ సమావేశాలకు సంబంధించిన పూర్తి వివరాలు మరో రెండు మూడు రోజుల్లో ఖరారయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సోమవారం రాజ్‌భవన్‌కు వెళ్లి గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్‌తో సమావేశమైన సంగతి తెలిసిందే. దాదాపు గంటపాటు జరిగిన ఈ సమావేశంలో అసెంబ్లీ సమావేశాల షెడ్యూల్, సభలో ప్రవేశపెట్టనున్న బిల్లులపై చర్చించినట్లుగా తెలిసింది. శాసనసభ డిప్యూటీ స్పీకర్ ఎన్నిక, ఇటీవల సీఎం ఢిల్లీ పర్యటన వివరాలు, తదితర అంశాలు కూడా వీరి మధ్య చర్చకు వచ్చినట్లు సమాచారం. కోనసీమలో జరుగుతున్న ఆందోళనలు, ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై గవర్నర్‌కు సీఎం జగన్ వివరించినట్లు అధికారిక వర్గాలు తెలిపాయి.

# ఆంధ్రప్రదేశ్‌పై కేఆర్ఎంబీకి తెలంగాణ ఫిర్యాదు

హైదరాబాద్ : ఆంధ్రప్రదేశ్‌పై కేఆర్ఎంబీకి తెలంగాణ ప్రభుత్వం ఫిర్యాదు చేసింది. కృష్ణా నదీ యాజమాన్య బోర్డుకు తెలంగాణ ఈఎన్‌సీ మురళి లేఖ రాశారు. వెలుగొండ సొరంగం తవ్వకం మట్టిని శ్రీశైలంలోకి తరలించడంపై ఫిర్యాదు చేసింది. మట్టిని జలాశయంలోకి తరలించకుండా ఆపాలని ఈఎన్‌సీ కోరారు. ఏపీ ప్రభుత్వం నుంచి పూర్తి వివరాలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఏపీ ప్రకాశం జిల్లా దోర్నాల మండలం కొత్తూరు నుంచి శ్రీశైలం బ్యాక్ వాటర్ నిలిచే కొల్లం వాగు వరకు వెలిగొండ ప్రాజెక్టు సొరంగం పనులు జరుగుతున్నాయి.సొరంగం లోపలి భాగంలో రెండో విడుత పనులు మొదలయ్యాయి. కార్మికులు, యంత్రాలు వెళ్లేందుకు మొదటి సొరంగం నుంచి భూగర్భంలో తవ్వుతున్నారు. ఈ క్రమంలో వచ్చే మట్టి, రాళ్ల వ్యర్థాలను కొల్లంవాగు వద్ద అటవీ ప్రాంతంలో డంప్ చేస్తున్నారు. రాత్రివేళ అక్కడి నుంచి లాంచీల్లోకి ఎక్కించి నదిలో కలిపేస్తున్నట్లుగా వార్తలు వస్తున్నాయి. గత పది రోజులుగా పెద్ద ఎత్తున మట్టి వ్యర్థాలను నదీ జలాల్లో కలిపేసినట్లు సమాచారం.శ్రీశైలం జలాశయం వాస్తవ నీటి నిల్వ సామర్థ్యం 308.60 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 215 టీఎంసీలకు పడిపోయింది. దాదాపు 92 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం కోల్పోయింది. ఇప్పుడు టన్నెల్ వ్యర్థాలు కూడా ప్రాజెక్టు దగ్గరలోనే కలుపుతుండడంతో పూడిక మరింత పెరిగి, నీటి నిల్వ సామర్థ్యం తగ్గే ప్రమాదం ఉన్నది. ఈ క్రమంలో తెలంగాణ ఈఎన్‌సీ కేఆర్ఎంబీకి లేఖ రాశారు.

## ఏపీ పది పరీక్ష ఫలితాలపై వైసీపీ-టీడీపీ ట్విట్టర్ వార్



అమరావతి: సోమవారం విడుదలైన పదో తరగతి పరీక్ష ఫలితాలపై టీడీపీ, వైసీపీల మధ్య మాటల యుద్ధం మొదలైంది. ట్విటర్ వేదికగా విమర్శనాస్త్రాలు సంధించుకున్నారు. ఏపీలో నిన్న విడుదలైన టెన్త్ ఫలితాల్లో 62.76 శాతం విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. టెన్త్ ఫలితాలపై ఎంపీ విజయసాయిరెడ్డి ట్విట్టర్ లో స్పందించారు. 'కలెక్టర్లకు టార్గెట్లు పెట్టి పిల్లలు ఫెయిలయితే చర్యలు తీసుకుంటామని బెదిరించింది ఎవరు? పాస్ పర్సంటేజీ పెంచేందుకు కిందిస్థాయి నుంచి పై వరకు ఏం చేశారో తెలియదా? మీ అండదండలున్న కార్పొరేట్ సంస్థలలో చదివే పిల్లలు ఆలిండియా ర్యాంకర్లాయె. ఇప్పుడా ర్యాంకులు తగ్గయాయని ఏడుపా బాబు' అని విజయసాయి రెడ్డి ట్వీట్ చేశారు.విజయసాయిరెడ్డి ట్వీట్‌కు టీడీపీ సీనియర్ నేత చింతకాయల అయ్యన్న పాత్రుడు తీవ్రంగా స్పందించారు. 'టెన్త్ క్లాసు పేపర్లు కొట్టేసి స్టేషన్‌లో తన్నులు తిన్నా పాస్ కాని నత్తి పకోడి రెడ్డి రెండు లక్షల మంది విద్యార్థులను ఫెయిల్ చేసి మూడు వేల కోట్ల అమ్మఒడి డబ్బును మిగుల్చుకోవాలని కన్నింగ్ ప్లానింగ్ వేశాడు. పనికిమాలినోడికి పదవి ఇచ్చినందుకు రిజల్ట్ రివర్స్ అయ్యాయి. విద్యావ్యవస్థ నాశనం అయింది' అని అయ్యన్న పాత్రుడు ట్వీట్ చేసి విజయసాయిరెడ్డికి సమాధానం ఇచ్చారు.కాగా, పదో తరగతి విద్యార్థుల ఆత్మహత్యలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని టీడీపీ నేత ధూళిపాళ్ల నరేంద్ర అన్నారు. వైసీపీ ప్రభుత్వం విద్యావ్యవస్థను నాశనం చేసిందని ఆరోపించారు. ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా రాష్ట్రంలోని దాదాపు 5 వేల పాఠశాలలు మూతపడ్డాయని, అలాగే ఇంగ్లిష్ బోధన వల్ల చిన్నారుల మానసిక వికాసం దెబ్బతింటున్నదని విచారం వ్యక్తం చేశారు.

# సంపాదకీయం

బుధవారం 08-06-2022

## చిన్నారులకు రక్షణ ఏదీ...

ఇంటికి అందం ఆడపిల్లలు. ఆడపిల్లల్ని చదివించి పెద్ద పెద్ద వుద్యోగాల్లో చూసుకుంటూ ఆనందిస్తున్నారు తల్లిదండ్రులు. ఆడపిల్లలకుచదువులే ఆభరణంగా తల్లిదండ్రులు భావిస్తున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ఆడపిల్లలకు రక్షణ విషయం మరింత కీలకమయింది . ఏ క్షణం ఏ వార్త వినాల్సి వస్తుందో తెలియని కాలంలో పిల్లల్ని బయటికి పంపుతున్నారు. స్కూలుకి వెళ్లన పిల్లలు బడి ముచ్చట్లు, ట్యూషన్ విశేషాలు, వాళ్ల స్నేహితుల సరదా కబుర్లతో ఇల్లంతా సందడి చేసే రోజులు పోయాయి. ఇప్పుడు అంతటా భయం భయం. ధైర్యంగా బడికి, కాలేజీకి, ఆఫీసులకు వెళుతున్నట్టు కనపడుతున్నారంతే! ఈ దురదృష్ట పరిస్థితులు ఎలా ఏర్పడ్డాయి అని ఆలోచించేకంటే పిల్లల రక్షణ విషయంలో తల్లిదండ్రులు, ప్రభుత్వాలు తీసుకునే జాగ్రత్తలే ప్రధానంగా మారాయి.ఇపుడు సమానత్వం భావనతోనే చదువు, ఆటల విషయాల్లో ఆడపిల్లల్ని ఎంతో ఉత్సాహపర్చడం మామూలయింది. కానీ వాళ్లు చాలా ప్రశాంతంగా, ఎలాంటి ఇబ్బందీ లేకుండా వుంటున్నారని గుండెమీద చేయి వేసుకుని చెప్పుకోగలిగిన తల్లిదండ్రుల శాతం బాగా తగ్గిందనే అనాలి. అమ్మాయికి ఆసక్తి వుందని గ్రహించి ఏ ఆటలోనో, మరేదో ప్రత్యేక శిక్షణలోనో చేర్పించితే ఆ పరంగా అభివృద్ధిలోకి వస్తారన్నది గొప్ప అభిప్రాయం. ఈ రోజుల్లో ఇది మరింత బలాన్ని సంతరించు కుంది. కానీ శిక్షణ పేరుతో, ప్రత్యేక క్లాసుల పేరుతో శిక్షణనిచ్చేవారు ఎలాంటి వారు అనే భయంతో కూడిన ప్రశ్న తల్లి వేసుకుంటూ బెంగగానే ఇంటిదగ్గర వుండటం కూడా జరుగుతోంది!అసలు ఆడపిల్లలు అనగానే కొంత చులకనా భావం కలగడం అనాదిగా వుంది. ఏడిపించడం అనేది మగాడి హక్కు , ఓ సరదా అని ఎవరో నూరిపోయక్కర్లేదు చుట్టుపక్కల వాతావరణం, ఇతరులను చూసే నేర్చుకుం టున్నారు. పూర్వం అదంతా సినిమాల ప్రభావం అనేవారు. ఇప్పుడు మొబైల్ ఫోన్‌ల ప్రభావం అంటు న్నారు. అర్థంలేని స్నేహాలు, పిచ్చిమాటలు, ఆలోచనలు తొమ్మిదో తరగతిలోనే ఆరంభమవుతు న్నాయి. ఆనక మగపిల్లలు దానికి కాస్తంత కార్యరూపం ఇచ్చే ధైర్యం చేస్తున్నారు. ఇది ఏకంగా కొందరు టీచర్లు, డాక్టర్లు, సహాయకులు, ఆఖరికి ఆటో డ్రైవర్లు కూడా! వీళ్లందరి దృష్టి ఒక్కటే వయసుతో నిమిత్తం లేదు. దుర్మార్గానికి పూనుకున్నప్పుడు ఎరగా కనిపించేవారి వయసుతో నిమిత్తం ఏముంటుంది? ఈ మధ్యనే 17 ఏళ్ల రొమేనియా అమ్మాయిని హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో కొందరు కుర్రాళ్లు కిడ్నాప్ చేసి కారులోనే రేప్ చేశారు. తల్లిదండ్రులు పోలీస్ కేసు పెట్టడానికి వెళితే పోలీసులు విచారించే సమ యంలో ఇది కాస్తంత హై ప్రొఫైల్ కేసు అన్నది అర్థమయి జుత్తుపీక్కున్నారు. నిందితుల్లో రాష్ట్ర మంత్రి మనవడు వున్నాడన్నది స్పష్టమయింది. ఈ కేసు అనేక ట్విస్ట్‌లు తిరుగుతోంది. అసలు నిందితులు వాడిన కారు వేరు, పోలీసులకు మరో ప్రాంతంలో దొరికిన కారు వేరు అని తేలింది. నిందితులు అమ్మాయిని ఎక్కించు కుని వేరే ప్రాంతానికి తీసికెళ్లిన కారు మంత్రి మనవడిది. అందువల్ల ప్రభుత్వం ఈ విషయంలో బాధ్యత వహించి కఠిన చర్యలు తీసుకోవాలన్న డిమాండ్ రోజు రోజుకూ బలపడుతోంది. పబ్‌కి వెళ్ల లేదని ఒకసారి, ఆ కారు నాదే కానీ కొంత దూరం తర్వాత తాను వేరే కారులో ఇంటికి వెళ్లానని, అందువల్ల ఆ అఘాయిత్యానికి తనకూ సంబంధం లేదని సదరు హై ప్రొఫైల్ కుర్రాడి వాదన. ఏది ఏమయినప్పటికీ అతని స్నేహితులే ప్రధాన నిందితులుగా వున్నపుడు, పబ్ దగ్గరి కెమెరాలు చెప్పినది పరిశీలించాలన్నా రు విపక్ష నాయకులు. అందుకు భిన్నంగా కేసు నుంచి యత్నాలు బలంగా జరిగాయన్నది విపక్షాల ఆగ్రహం. మరి ఈ కేసు ఇంకా ఏ విధంగా మలుపు తిరుగుతుంది, ఎంతమంది నిందితులుగా తేలనున్నారు, ఈ మొత్తం సీన్ నుంచి మంత్రిగారి మనవడిని ఈ కేసు నుంచి తప్పించడానికి ఇంకెన్ని ప్రయత్నాలు జరుగుతాయి.. వేచి చూడాల్సిందే. ఈ సంఘటన ఇంకా రాజకీయంగా, సామాజికంగా ప్రకంపనలు సృష్టిస్తున్నసమయంలోనే భాగ్యనగరంలోనే, అదీ విశ్వనగరంగా టీఆర్ఎస్ గొప్పలు చెప్పుకుంటున్నహైదరాబాద్ లో మరో మైనర్ బాలికపై సామూహిక అత్యాచారం జరిగింది.ఒక బాలికను ఇంటి దగ్గర డ్రాప్‌చేస్తానని క్యాబ్ వాడు తీసికెళ్లి వాడి స్నేహితుడితో పాటు ఆమెపై అఘాయిత్యం చేసేడు. ఈ కేసులో నిందితులు కిషన్‌బాగ్ ప్రాంతానికి చెందిన క్యాబ్ డ్రైవర్ షేక్ కలీం, మహ్మద్ యాజ్దానీలను అరెస్టు చేశారు. దేశంలోనే శాంతి భద్రతలు అత్యద్భుతంగా విలసిల్లుతున్నాయనీ, విరాజిల్లుతున్నాయనీ టీఆర్ఎస్ ప్రభుత్వం ఒక పక్క గప్పాలు కొట్టుకుంటుంటే.. బంగారు తల్లులు రక్షణ కరవై చితికి పోతున్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం పబ్ లను నియంత్రించడానికి ఎటువంటి ప్రయత్నాలూ చేయకపోవడం, యథేచ్ఛగా పబ్ లలో మైనర్లకూ ప్రవేశం కల్పిస్తున్నా పట్టించుకోకపోవడంతో రాష్ట్రంలో మహిళలపై అఘాయిత్యాలు నిత్యకృత్యంగా మారిపోయాయన్నవిమర్శలు వెల్లువెత్తుతున్నాయి.మైనర్ లపై అత్యాచారాలను అరికట్టే విషయంలో పోలీసులు మరింత అప్రమత్తంగా, కఠినంగా వ్యవహరించాల్సి ఉంది. హై ప్రొఫైల్ రేప్ కేసులో నిజమైన నింది?తులను చట్టం ముందు ప్రవేశపెట్టి కఠిన శిక్షలు పడేలా, అదీ ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవలసిన అవసరం ఉంది.

# పొత్తుల తుట్టెను కదిపిన జనసేనాని

విజయవాడ, జూన్ 7, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా రెండు రోజుల ఏపీ రాష్ట్ర పర్యటించారు. సోమవారం ఢిల్లీ నుంచి గన్నవరం చేరుకున్న నడ్డా.. విజయవాడ సిద్దార్థ కాలేజీ మైదానంలో బీజేపీ శక్తి కేంద్ర ప్రముఖ్‌ల సభలో పాల్గొన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలనే సంకేతంతో పాటుగా, శక్తి కేంద్ర ప్రముఖ్‌లకు మార్గదర్శనం చేశారు. అయుష్ మాన్ భారత్, తదితర కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రచారం చేయాలని నేతలకు తెలిపారు.ఆయుష్మాన్ భారత్‌ను జగన్ సర్కార్ ఆరోగ్యశ్రీగా మార్చిందని అన్నారు. ఆరోగ్యశ్రీ జగన్ పథకం కాదని.. కేంద్ర ప్రభుత్వ పథకమని చెప్పుకొచ్చారు. సౌభాగ్య కార్యక్రమం రెండున్నర కోట్ల మంది జీవితాల్లో వెలుగులు నింపిందన్నారు. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి కింద రైతులకు ప్రయోజనం కల్పిస్తున్నామని జేపీ నడ్డా పేర్కొన్నారు.ఇంకా చాలా విషయాలు ఆయన చెప్పు కొచ్చారు. అయితే, ఇంచు మించుగా గంటకు పైగా సాగిన ప్రసంగంలో, నడ్డా ఎక్కడా, మిత్ర పక్షం జనసేన ప్రస్తావన చేయలేదు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్'ను కూటమి ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించాలని ఆ పార్టీ గత రెండు మూడు రోజులుగా చేస్తున్న 'డిమాండ్' అంశాన్ని అసలు ప్రస్తావించనే లేదు. ఆయన పూర్తిగా బీజేపీ సంస్థాగత వ్యవహారాలకే పరిమితమయ్యారు. అయితే, నడ్డా ఏపీలో అడుగుపెట్టడానికి ముందే, గన్నవరం విమానశ్రయంలో బీజేపీ రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు, జనసేనకు షాకిచ్చారు.. పవన్ కళ్యాణ్‌ను సీఎం అభ్యర్థిగా ప్రకటించాలని జనసేన నేతలు చేస్తున్న డిమాండ్‌పై నడ్డా ఎలాంటి ప్రకటన చేయరు అని తెగేసి చెప్పారు. ఎవరో డిమాండ్ చేస్తే సీఎం అభ్యర్థిని ప్రకటించడం కుదరదన్నారు. బీజేపీని ఏపీలో బలీయమైన శక్తిగా మార్చడమే లక్ష్యంగా నడ్డా ఏపీ పర్యటనకు వచ్చారని ఆయన వ్యాఖ్యానించారు. నడ్డా వచ్చేది సీఎం అభ్యర్థి విషయమై మాట్లాడటానికి కాదని జీవీఎల్ తెలిపారు. కాబట్టి సీఎం అభ్యర్థిపై నడ్డా పర్యటన సందర్భంగా ఎలాంటి ప్రకటన ఉండదని ఆయన స్పష్టం చేశారు.ముఖ్యమంత్రి అభ్యర్థి ఎవరనేది జాతీయ స్థాయి నేతలు నిర్ణయిస్తారని.. తాము కాదని ఆయన తెలిపారు. మరో వంక నడ్డా, పవన్ కళ్యాణ్'ను ముఖ్యమంత్రిగా ప్రకటించక పోతే, రెండు రోజుల తర్వాత భవిష్యత్ ప్రణాళిక ప్రకటిస్తామని జనసేన నాయకులు హెచ్చరించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బీజేపీ, జనసేన పొత్తు ఉంటుందా ? ఊడుతుందా? అనేది అనుమానంగా మారింది. అదలా ఉంటే, జీవీఎల్ వ్యాఖ్యలపై స్పందించిన, జనసేన నాయకుడు పసుపులేటి హరిప్రసాద్ వచ్చే ఎన్నికల్లో ఒంటరిగానే గెలిచి అధికారంలోకి వచ్చే సత్తా తమ పార్టీకి ఉందని.. కానీ కేంద్రంతో సఖ్యతతో ఉంటే రాష్ట్రానికి ప్రయోజకరం అనే ఉద్దేశంతోనే బీజేపీతో పొత్తు పెట్టుకున్నామని చెప్పుకొచ్చారు. మరోవంక జనసేన అధినేత్ పవన్ కళ్యాణ్ సమయం సందర్భం లేకుండా, పదే పదే పొత్తుల ప్రస్తావన ఎందుకు చేస్తున్నారు? ఎందుకు ఒక మాట మీద నిలవకుండా, ఎప్పటికప్పుడు మాట మారుస్తున్నారు? కొత్త కొత్త ప్రతిపాదనలు చేస్తున్నారు? అనే చర్చ జరుగుతోంది. ముందు వైసీపీ వ్యతిరేక ఓటు చీలకుండా చూసే బాధ్యత తీసుకుంటానని ప్రకటించారు. బీజేపీ జాతీయ నాయకులతో ఏమి మట్లాడారో, ఏమి మాట్లాడలేదో ఏమో కానీ, బీజేపీ, టీడీపీలను కలిపే బాధ్యత కూడా తమదేనని, తనంతట తానే ప్రకటించారు. ఇప్పుడు అవన్నీ పక్కకు నెట్టి, బైబిల్ సూక్తులను ఉటంకిస్తూ, పొత్తులకు సంబంధించి మూడు ఆప్షనల్'తో కొత్త ఫార్ములాను తెర మీదకు తెచ్చారు. కొత్త ఫార్ములాలో పవన్ కళ్యాణ్ మూడు ఆప్షనల్స్ ప్రస్తావించినా, అన్నిటి సారం, సారంశం ఒక్కటే... రాష్ట్రంలో 40 శాతం ఓటున్న టీడీపీ, కేంద్రంతో పాటుగా దేశంలో 18 రాష్ట్రాలలో అధికారంలో ఉన్న బీజేపీ, బోయీలుగా మారి తమను అధికార పల్లకీలో ఎక్కించాలని, పవన్ కళ్యాణ్ అద్భుత ప్రతిపాదన చేశారు.దీంతో ఇప్పుడు పవన్ కళ్యాణ్' ఉద్దేశంఏమిటి? ఎన్నికలు ఇంకా చాల దూరంలో ఉండగానే ఆయన పొత్తుల తేనే తుట్టెను ఎందుకు కదిపారు? వైసీపీ వ్యతిరేక ఓటు చీలకుండా చూస్తానని చెప్పిన ఆయన ఇప్పుడు, ప్రతిపక్షాల మధ్య చిచ్చు పెట్టడం వెనక ఉన్న ఉద్దేశం ఏమిటి? ఎవరి ప్రోద్బలంతో, పవన్ కళ్యాణ్ ప్రజలలో రాజకీయ గందరగోళం సృష్టిస్తున్నారు.ఓ వంక వైసీపీ ప్రభుత్వం పట్ల ప్రజల్లో వ్యతిరేకత పెరుగతున్న నేపథ్యంలో ప్రజలు తెలుగు దేశం వైపు చూస్తున్న సమయంలో, పవన్ కళ్యాణ్ ప్రతిపక్షాల మద్య చిచ్చు పెట్టే ప్రయత్నం ఎందుకు చేస్తున్నారు. తమ్ముడు పవన్, అన్నయ్య చిరంజీవి బాటలో నడుస్తున్నారా? ప్రతిపక్షం ఓట్లను చీల్చి, చివరకు అన్న చిరంజీవి, ప్రజారాజ్యం పార్టీని తల్లి కాంగ్రెస్'లో కలిపినట్లు, తమ్ముడు పవన్, జనసేనను పిల్ల కాంగ్రెస్'లో కలిపేందుకు, డీల్ కుదుర్చుకున్నారా? ఈ డీల్ వెనక ఢిల్లీ పెద్దల ఆశీస్సులు ఉన్నాయా? అంటే, పరిశీలకులు కాదనలేమనే అంటున్నారు.

# బొత్స కేడర్... చెల్లా చెదర్

విజయనగరం, జూన్ 7, బొత్స సత్యనారాయణ పవర్‌లోనే ఉన్నా... పార్టీలో ఆయన పవర్ క్రమ క్రమంగా తగ్గిపోతోందా? ఆ క్రమంలో సొంత జిల్లా విజయనగరంపై ఆయన పట్టుకోల్పోతున్నారా? జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో వైసీపీ క్యాడర్ తెలుగుదేశంలోని జంప్ అవుతోందా? అంటే ఔననే సమాధానమే వస్తుంది. చీపురుపల్లి నియోజకవర్గం నుంచి వైసీపీ క్యాడర్ సైకిలెక్కడానికి సిద్ధమౌతోంది. ఒక్క చీపురుపల్లి అనేమిటి.. విజయనగరం జిల్లా మొత్తంగా వైసీపీ నుంచి తెలుగుదేశంలోకి వలసలు పెరుగుతున్నాయి. దీంతో బొత్స సత్యన్నారాయణకుపార్టీ అధిష్ఠానం ఆగ్రహ సెగ తగులుతోందట. తాడేపల్లి ప్యాలస్ విజయనగరం జిల్లాలో పార్టీ నుంచి వలసలపై వస్తున్న ప్రశ్నల శరాలు తట్టుకోలేక బొత్స ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు.దీంతో అసలు విజయనగరంలో ఏం జరుగుతోందో తెలియక పార్టీ అగ్రనేతలు.. ఉత్తరాంధ్ర ఇన్‌చార్జ్ వై వీ సుబ్బారెడ్డిని ఆశ్రయించి.. జిల్లాలో చోటు చేసుకొంటున్న తాజా పరిణామాలపై దృష్టి సారించి నివేదిక ఇవ్వాలని సూచించినట్లు తెలుస్తోంది. దీంతో రంగంలోకి దిగిన వైవీ సుబ్బారెడ్డి.. జిల్లాలో కేడర్ జంపింగ్ కావడానికి గల రీజన్, రీజనింగ్ పై ఆరా తీయగా.. ఆసక్తికర అంశాలు వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. విజయనగరం జిల్లా అంటేనే బొత్స సత్తిబాబు.. బొత్స సత్తిబాబు అంటేనే విజయనగరం జిల్లా అనుకునే పరిస్థితి నుంచి బొత్స సత్తిబాబు అండ్ కో.. ఒంటెద్దు పోకడలతో.. ఏక పక్ష నిర్ణయాలతో బొత్స ఉంటే విజయనగరంలో వైసీపీ ఖాళీ అనే పరిస్థితి ఏర్పడిందట. బొత్స వైఖరిని చూసి జిల్లాలోని పార్టీ ఎమ్మెల్యేలు సైతం ఇదే ధోరణి అవలంబిస్తున్నారని.... దాంతో క్యాడర్ విసిగి వేశారిపోయి బొత్స, ఇతర ఎమ్మెల్యేల తీరుపై బాహటంగానే విమర్శలు గుప్పిస్తూ.. సైకిల్ ఎక్కేస్తున్నారని వైవీ సుబ్బారెడ్డికి అందిన సమాచారం. అలాగే జగన్ పరిపాలనపై ప్రజలలో పెరుగుతున్న వ్యతిరేకత కూడా జిల్లా నుంచి వలసలకు ఒక కారణం అన్న సమాచారం కూడా వైవీ సుబ్బారెడ్డి ఆరాలో తేలిందని ఆ పార్టీ శ్రేణులే చెబుతున్నాయి.వైయస్ జగన్ తొలి కేబినెట్‌లోనే కాదు.. మలి కేబినెట్‌లో సైతం బొత్స సత్యనారాయణ మంత్రిగా కొనసాగుతున్న సంగతి విదితమే. అయితే జగన్ మలి కేబినెట్‌లో బొత్సకు చోటు దక్కకపోవచ్చుననే చర్చ బాగానే జరిగింది. విజయనగరం ఎమ్మెల్యే కె.వీరభ్రదస్వామికి మంత్రి పదవి కట్టబెడదామని తొలుత సీఎం జగన్ భావించారని సమాచారం. కానీ వచ్చే ఎన్నికల్లో జిల్లాలో మళ్లీ ఫ్యాన్ పార్టీ సత్తా చాటాలంటే.. తనకు కేబినెట్ కొలువు తప్పని సరి అని బొత్స సత్తిబాబు జగన్ పై ఒత్తిడి పెంచడంతో తప్పని సరి పరిస్థితుల్లో ఒకింత అయిష్టంగానే జగన్ బొత్సకు కేబినెట్ లో చోటు పదిలం చేశారని చెబుతున్నారు.అయితే ఒకింత అప్రాధాన్యత ఉన్న కేబినెట్ పోర్టుపోలియో కట్టబెట్టడంతో బొత్స రగిలిపోయారని సమాచారం. శాఖను అంటే విద్యాశాఖను పట్టించుకోక పోవడం వల్లనే టెన్త్ ప్రశ్నపత్రాల లీకేజీ, ఆ తరువాత చివరి నిముషంలో ఫలితాల విడుదల వాయిదా వంటి అంశాలు చోటు చేసుకున్నా యని పార్టీ శ్రేణులు బాహాటంగానే చెప్పుకుంటున్నారు. రాష్ట్ర విభజన తరువాత తొలిసారి జరిగిన ఎన్నికలలో బొత్స సత్యనారాయణ చీపురుపల్లి నియోజకవర్గం నుంచి ఘోర పరాజయం పాలైన సంగతి విదితమే. తదుపరి ఎన్నికలలో ఆయన విజయం సాధించినా అది ఫ్యాను గాలి స్పీడ్ తోనే అని వైసీపీ శ్రేణులు ఇప్పుడు విశ్లేషణలు చెబుతున్నారు.ఆయనకు తన సొంత నియోజకవర్గంపై, జిల్లాపై నిజంగానే పట్టు ఉంటే 2014 ఎన్నికలలోనే జిల్లాలో పట్టు నిరూపించుకుని ఉండేవారు కదా అంటున్నారు. జిల్లాలో అన్ని విధాలుగా పరపతి కోల్పోయిన బొత్స సత్యనారాయణకు జగన్ పార్టీ అండతోనే ఎమ్మెల్యేగిరీ, మంత్రిపదవీ దక్కాయని వైసీపీ క్యాడర్ చెబుతోంది. అటువంటి వ్యక్తి తన ఒంటెత్తు పోకడలతో క్యాడర్ ను పార్టీకి దూరం చేస్తున్నారని పలువురు జిల్లా నేతలు వైవీ సుబ్బారెడ్డికి నివేదించినట్లు సమాచారం. బొత్స ఒంటెత్తు పోకడ కారణంగానే జిల్లాలో దాదాపు 2000 మంది వైసీపీకి గుడ్ బై చెప్పి తెలుగేదేశం గూటికి చేరారని వైవీకి నివేదిక అందిందంటున్నారు.ఆ తరువాత బొత్స రంగప్రవేశం చేసి నష్ట నివారణకు చర్యలు చేపట్టినా ఫలితం మాత్రం అంతంత మాత్రంగానే ఉందని అంటున్నారు. నుంచి జిల్లా చిట్ట చివర నియోజకవర్గం వరకు ఫ్యాన్ పార్టీలోని కేడర్ మొత్తాన్ని లక్ష్యంగా చేసుకోని.. సైకిల్ పార్టీ నేతలు పావులు కదుపుతున్నారు. ఎన్నికలకు ఇంకా రెండేళ్ల సమయం ఉంది. దీంతో ఫ్యాన్ పార్టీలోని కేడర్‌నే కాదు.. లీడర్లను సైతం సైకిల్ ఎక్కించే పనిలో తెలుగు తమ్ముళ్లు.. ఫిక్స్ అయిపోయారని సమాచారం. జిల్లాలో వైసీపీ బలం, ప్రతిష్ట వేగంగా దిగ జారిపోతుండటంతో పార్టీలో బొత్స ఉక్కిరిబిక్కిరి అవుతున్నారనీ, పార్టీ అధిష్ఠానం ఆగ్రహానికి ఉక్కపోతకు గురౌతున్నారని పార్టీ క్యాడరే బొత్స మీద సెటైర్లు వెస్తున్నది.

# కాషాయ నేతల మాటల కోటలు

విజయవాడ, జూన్ 7, ఏపీలో బీజేపీకి ఎలాంటి పొలిటికల్ స్టేకూ లేదు. కానీ బీజేపీ నేతల మాటలు మాత్రం కోటలు దాటేస్తున్నాయి. గ్రామాల్లో పండుగలు, పబ్బాల సమయంలో వచ్చి వినోదాన్ని పంచే పిట్టల దొరలు కూడా ఈ స్థాయిలో గొప్పలు చెప్పి వినోదాన్ని పంచలేరు. కానీ బీజేపీ ఏపీ నేతలు మాత్రం.. గొప్పలు చెప్పుకోవడంలో, అతిశయోక్తులు చెప్పడంలో ఇప్పటి వరకూ ఉన్న అన్ని రికార్డులూ చెరిపేస్తున్నారు.రాష్ట్రంలో బీజేపీకి 175 నియోజకవర్గాల్లో ఒక్కరంటె ఒక్క అబ్యర్దిగా చెప్పుకో దగ్గ నేత లేరు. అయినా ముఖ్యమంత్రి అభ్యర్ది ని డిసైడ్ చేస్తాం.....బిజెపి తో పొత్తులు కొసం అన్నీ పార్టీ లు ఎగబడుతున్నాయి అంటూ బడాయి మాటలు మాటాడు తున్నారు. ఢిల్లీకి పోయో నేతలు అందరూ బడా బాబులే.. కాని స్థానికంగా పార్టీని నడిపించే వారులేక ఉన్న పదిమందికూడా ఏదో ఒక పార్టీ నేతలతొ కలిసి తిరుగుతున్నారు.బిజెపి పార్టీ గొప్పల గురించి చాంతాడంత గొప్పలు చెప్పే సోము వీర్రాజు. ..అండ్ కో నేతలు ఆత్మకూరు ఉప ఎన్నికల్లో పోటీ చేసేందుకు కు అబ్యర్ది లేక ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు భరత్ కుమార్ యాదవ్ ను బరిలో దించింది. దింగత మేకపాటి గౌతమ్ రెడ్డి. మరణం తరువాత ఉప ఎన్నికలు తధ్యమని తెలిసినా ఇన్ని నెలలు అక్కడ బిజెపి అబ్యర్ది ఎవరన్నది నిర్ణయం చేయలేకపోయింది. ఇక కడాఖరుకు పరువు పోతుందని ఆఖరి రోజు ఆ పార్టీ జిల్లా అద్యక్షుడి చేత నామినేషన్ వేయించి సోము వీర్రాజు ఓ రేంజ్ లో కేకలు వేసి వైసిపికి సవాల్ విసిరి వెళ్లిపోయారు.వెళుతూ వెళుతూ టిడిపి ఎలాగూ పోటీలో లేదు కదా మీకు వైసిపి పార్టీ మీద కోపం ఉంటే మాకు ఓట్లేయండి అని ప్రాధేయపడి వెళ్లారు. ఇంతకు ఉప ఎన్నికల్లో స్థానికంగా ఉన్న నేతలను పోటీలో నిలబెట్టే దిక్కులేని దశలో బిజెపి పార్టీ ఉంది.అలాంటి పార్టీ పక్క పార్టీలను శాసిస్తామని కొతలు కోసి వెళతుంటే ప్రజలు విరగబడి నవ్వుకుంటున్నారు. గతంలో బద్వేల్ , తిరుపతి ఉప ఎన్నకల్లో పోటీ చేసి డిపాజిట్ కొల్పోయిన బిజెపి ఇప్పుడు ఆత్మకూరు ఉప ఎన్నికల్లో పోటీ చేసి ఏం సాధించాలనుకుంటోంది? మరోసారి డిపాజిట్ గల్లంతు చేసుకోవడం తప్ప. నామి నేషన్ రోజున వచ్చిన నేతలు మళ్లి కనిపించక పోవడంతో ఆ పార్టీ నేతలను సామాజిక మాధ్యమంలో సెటైర్లతో విపరీతంగా ట్రోల్ చేస్తున్నారు.

# పీచేమూడ్ లో కాషాయ నేతలు

తిరుపతి, జూన్ 7,ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఒకప్పుడు తిరుపతి లోక్‌సభ సీటు గెలిచిన బీజేపీ.. ప్రస్తుతం ఉందా లేదా అన్నట్టుగా మారిపోయింది. జిల్లాలో గుర్తింపు పొందిన కమలనాథులు ఏమైపోయారో అని కేడర్ ప్రశ్నించుకుంటున్న పరిస్థితి ఉంది. బాదుడే బాదుడు పేరుతో టీడీపీ నియోజకవర్గాలను చుట్టేస్తోంది. జనసేన కూడా ఏదో ఒక నిరసనతో జనాల్లో ఉండేందుకు చూస్తోంది. అధికారపార్టీ వైసీపీ గడప గడపకు మన ప్రభుత్వం అని ఊరూరా తిరుగుతోంది. ఈ రాజకీయ సందడిలో కనిపించంది బీజేపీ నేతలేనని లోకల్‌గా చెవులు కొరుక్కుంటున్నారు.ఎప్పుడు ఎన్నికలొచ్చినా.. గెలుపుమాదే అని గంభీరమైన ప్రకటనలు చేసే చిత్తూరు జిల్లా బీజేపీ నేతలకు ఏమైంది అని ఆరా తీస్తున్నారట. సొంత కేడరే మావాళ్లు ఎక్కడా అని వాకబు చేస్తున్నారట. ఆ మధ్య తిరుపతి లోక్‌సభ ఉపఎన్నిక సమయంలో బీజేపీ అగ్రనేతలు వరసపెట్టి వచ్చారు. ప్రచారం ఊదరగొట్టారు. ఆ ఎన్నిక కాగానే కమలనాథులు ఎక్కడివారు అక్కడే గప్‌చుప్. పొరుగు ప్రాంతాల నుంచి వచ్చిన వాళ్లు ఎన్నికలు కాగానే ఎలాగూ వెళ్లిపోతారు. కానీ.. లోకల్ బీజేపీ నేతలు కూడా కనిపించకుండా పోయారన్నది చర్చ.2019 ఎన్నికల్లో జిల్లాలో బీజేపీకి నామ మాత్రంగానే ఓట్లు వచ్చాయి. పెద్దగా పోటీ ఇచ్చింది కూడా లేదు. ఒక్క శ్రీకాళహస్తిలోనే ఎమ్మెల్యే అభ్యర్థి ఒక్కరే కాస్త హడావిడి చేశారు. గౌరవప్రదమైన ఓట్లు కూడా బీజేపీ అభ్యర్థులకు రాలేదు. అప్పటికి ఇప్పటికీ పరిస్థితిలో పెద్ద మార్పు రాలేదన్నది స్థానికంగా వినిపించే మాట. మధ్యలో తిరుపతి ఎంపీ ఉపఎన్నిక జరిగినా ఆ వేడిని కొనసాగించలేకపోయారు. పైగా జిల్లా బీజేపీ నేతల పనితీరుపై రాష్ట్ర నాయకులు అసంతృప్తితో ఉన్నట్టు సమాచారం.ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఆధ్యాత్మిక కేంద్రంగా ఉండటంతో బీజేపీ నేతలు ఇక్కడ క్రియాశీలకంగా ఉండేందుకు చూస్తుంటారు. కానీ.. జిల్లా బీజేపీలో ఉన్న అంతర్గత విభేదాలతో పార్టీ ఎదిగే పరిస్థితి కనిపించడం లేదని కాషాయ శిబిరంలోనే చెవులు కొరుక్కుంటున్నారు. పైగా కేడర్ కంటే లీడర్లే ఎక్కువనే సెటైర్లు పేలుతుంటాయి. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు రెండు నెలలకో.. మూడు నెలలకో తిరుపతి వస్తే జిల్లా నేతల అంతా ప్రత్యక్షం అవుతారు. వీర్రాజు వెళ్లిపోగానే అప్పటి వరకు హడావిడి చేసిన నాయకులు ఏమైపోతున్నారో కేడర్‌కే అర్థంకాదట. బీజేపీ, జనసేన మిత్రపక్షాలుగా ఉన్న కలిసి కార్యక్రమాలు చేస్తున్న పరిస్థితి లేదు. జిల్లాలోని 14 నియోజకవర్గాలకు అభ్యర్థులను సిద్ధం చేస్తున్నారో లేదో కూడా తమకే తెలియదని అంటున్నాయి శ్రేణులు. మరి.. క్షేత్రస్థాయిలోని ఈ ప్రతికూల పరిస్థితులను బీజేపీ పెద్దలు ఎలా అధిగమిస్తారో చూడాలి.

# గృహ నిర్మాణం, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

### అధికారులకు జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు ఆదేశాలు

కడప గృహ నిర్మాణం, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని.. జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు క్షేత్రస్థాయి అధికారులను ఆదేశించ పత్రికోమవారం కలెక్టరేట్ సభాభవన్ లో జేసీ.సాయికాంత్ వర్మ, డిఆర్వో మాలోల, నగర కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్ చంద్, హౌసింగ్ పీడి కృష్ణయ్య లతో కలిసి.. జగనన్న హౌసింగ్ కాలనీల్లో గృహ నిర్మాణ పనుల పురోగతి, ఓటీఎస్, జగనన్న స్వచ్ఛ సంకల్పం యాక్షన్ ప్లాన్, గ్రావెల్ మైనింగ్ పర్మిషన్ లతో పాటు.. అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలు తీరు, పురోగతి, సర్వీసు రిక్వెస్టులు - పరిష్కారాలు తదితర అంశాలపై మండల స్థచేయాలన్నారు ?గ స్థాయి అధికారులతో జిల్లా కలెక్టర్ వి.విజయరామరాజు.. నేరుగా సమీక్షిప్రకటనసందర్భంగా జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు మాట్లాడుతూ... ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు.. ప్రజప్రకటన్త స్థాయిలో అందాలనే ప్రభుత్వ లక్ష్యం మేరకు అధికారులందరూ నిబద్ధతతో పని చేయాలన్నారు. గ్రామాలు, వార్డుచేయాలన్నారుకన్ టైం సెటిల్మెంట్ (ఓటీఎస్) ప్రక్రియలో స్టేజి కన్వర్షన్, డిజిటల్ సైనింగ్ పనులను వేగంగా పూర్తి చేయాలన్నారుకల జిల్లాలో జగనన్న హౌసింగ్ పథకం.. ఎంత ప్రధాన్యతతో నిర్వహించడం జరుగుతుందో.. అంతే ప్రధాన్యతతో ''జగనన్న స్వచ్ఛ సంకల్పం'' కార్యక్రమాన్ని కూడా చేపడ్డాడం జరుగుతోందన్నారు. అందులో భాగంగా.. ప్రతి గ్రామంలో పారిశుద్ధ్య పనులు క్రమం తప్పకుండా నిర్వహించాలన్నారు. ప్రతి ఇంటికి ట్విన్ బిన్స్, ఘన వ్యర్థ పదార్థాల సేకరణ, వెర్మి కంపోస్టు షెడ్స్ ఏర్పాటు మొదలైన అన్ని పనుల నిర్వహణను ప్రణాళికాబద్ధంగా నిరంతరాయంగా.. జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. వర్షాకాలం సమీపిస్తుండడంతో డ్రైనేజీ కాలువల్లో పిచ్చి మొక్కలు తొలగింపు, దోమల నియంత్రణ చర్యలను ఈ వారం లోగా పూర్తి చేయాలన్నారు. అన్ని మున్సిపాలిటీలు, గ్రామాల పరిధిలో ఎక్కడా కూడా చిన్న చెత్త కుప్ప కూడా కనిపించకూడదని.. ఈఓపిఆర్డిలు, ఎంపిడివోలను ఆదేశించారు. ప్రతి ఒక్కరూ.. ఉద్యోగ బాధ్యతలతో పాటు.. ఆరోగ్య భద్రత కూడా మీ చేతుల్లోనే ఉందని అధికారులకు సూచించారు.స్పందన పోర్టల్, మీ-సేవా, ఏపీ సేవా పోర్టల్ లో ప్రతిరోజు విధిగా సర్వీసు రిక్వెస్టులను పరిశీలించి సంబంధిత రిపోర్టులు, పరిష్కార నివేదికలను నమోదు చేయాలన్నారు. ప్రతి వారం ప్రగతి నివేదికలు అందజేయాలన్నారు. ప్రధానంగా.. జగనన్న హౌసింగ్ కాలనీల నిర్మాణ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని.. ఆయా మండలాలు, మున్సిపాలిటీల పరిధిలోని లే అవుట్లలో గృహ నిర్మాణ పను పురోగతిపై ఒక్కొక్కరిని అడిగి తెలుసుకున్నారు. గృహనిర్మాణ పలనులను లక్ష్యం మేరకు పూర్తి చేయాలని.. ఆదేశించారు. జేసీ సాయికాంత్ వర్మ మాట్లాడుతూ... సచివాలయాల పరిధిలో ప్రతి ఇంట్లో విధిగా ఫీవర్ సర్వే నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. హౌసింగ్ లేఅవుట్స్, హౌస్ గ్రౌండింగ్, నిర్మాణ పనుల వేగవంతంతో పాటు..

భూ రికార్డుల స్వచ్ఛీకరణలో భాగంగా రీసర్వే, జగనన్న సంపూర్ణ గృహహక్కుకు సంబంధించి.. ఓటీఎస్, కోవిడ్ వాక్సినేషన్, సచివాలయాల్లో బయోమెట్రిక్, సచివాలయ భవన నిర్మాణాలు, స్పందన అర్జీల పరిష్కారం వేగవంతం వంటి అంశాలపై యాక్షన్ ప్లాన్, పురోగతిపై.. సిహెచ్‌ఓలు, ఎంహెచ్‌ఓ లతో సమీక్షించారు. జగనన్న స్వచ్ఛ సంకల్పంతో భాగంగా.. పట్టణ ప్రాంతాల్లో చేపడుతున్న ఇళ్ల నుండి చెత్త సేకరణ కార్యక్రమంపై ఎంపిడివోలు, మున్సిపల్ అధికారులు, పంచాయతీ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ-శ్రమ్ పోర్టల్ ద్వారా.. మండల వారీగా కూలీల డేటాను సేకరించి నమోదు చేయాలన్నారు. నాడు-నేడు పనులను ఎక్కడా కూడా నిర్మాణ పనుల్లో జాప్యం జరగకుండా.. నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలన్నారు. అంతేకాకుండా.. ఎన్.ఆర్.ఈ.జి.ఎస్. పనిదినాలను కల్పించడంలో జిల్లాకు నిర్దేశించిన రోజువారీ లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కడప, జమ్మలమడుగు, బద్వేలు రెవెన్యూ డివిజన్ల.. ఆర్డీవోలు ధర్మచంద్రారెడ్డి, శ్రీనివాసులు, వెంకటరమణ లతో పాటు నియోజకవర్గ, మండల ప్రత్యేకధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహశీల్దార్లు, ఎంపిడివోలు, హౌసింగ్, డ్వామా, డిఆర్డీఏ, పీఆర్ అధికారులు, ఇంజనీర్లు తదితరులు హాజరయ్యారు.

# లంకెబిందెలు ఉన్నాయంటూ లేఖ

గుంటూరు, జూన్ 7, సాధారణంగా స్థలం వివాదంలోనో, పొలం గొడవలోనో లేదంటే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందటం లేదనో కలెక్టర్ గ్రీవెన్స్ కు ఫిర్యాదులు వస్తుంటాయి. అయితే రెండు వారాల క్రితం పల్నాడు జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్ కు వచ్చిన ఫిర్యాదుతో అధికారులే ఖంగుతిన్నారు. ఇంతకీ ఏం జరిగిందో ఇప్పుడు తెలుసుకుందాం.. మా స్థలంలో లంకె బిందెలు ఉన్నాయి పురవస్తుశాఖ ద్వారా తవ్వించండి అంటూ ఓ మహిళ సాక్షాత్తు గ్రీవెన్స్ లో పల్నాడు జిల్లా కలెక్టర్ ను కోరిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలలోకి వెళ్తే పల్నాడు జిల్లా కారంపూడికి చెందిన దిల్షాద్ బేగం అనే ముస్లిం మహిళ తన పూర్వికుల స్థలం కారంపూడిలోని కన్యకాపరమేశ్వరి దేవస్థానం పక్కన గల బజారులో ఉన్నదని సదరు స్థలంలో లంకెబిందెలు ఉన్నట్లు తనకు తెలిసిందని స్వయంగా పల్నాడు జిల్లా కలెక్టర్ కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసింది.కారంపూడి తన స్వగ్రామం అని, అత్తగారిది గుంటూరు అని ఆ స్థలం తన పూర్వికులదని, ప్రభుత్వం చొరవచూపి తవ్వకాలు జరిపితే లంకెబిందెలు దొరికే అవకాశం ఉందని ఆమె లేఖలో పేర్కొంది. ఈ ఫిర్యాదుపై విచారణ జరపవలసిందిగా కారంపూడి తహసీల్దార్ జె. ప్రసాదరావు ను పల్నాడు జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఫిర్యాదులో వాస్తవమెంత, స్థలం వివాదం ఏమైనా ఉందా, ప్రస్తుతం ఆ స్థలం ఎవరి ఆధీనంలో ఉంది అన్న అంశాలపై స్పష్టత కోరినట్లు తెలుస్తుంది. అయితే స్థానికుల వాదన మరోలా ఉంది. ప్రస్తుతం ఆ స్థలంలో మదర్సా ఉందని పదిమంది పిల్లలు చదువుకుంటున్నారని చెప్పారు. స్థల వివాదం కోర్టు పరిధిలో ఉందని ఈ క్రమంలోనే లంకె బిందెల ఉన్నాయన్న అంశం ఉద్దేశపూర్వకంగా తెరపైకి తెచ్చినట్లు చెబుతున్నారు. దర్యాప్తు పూర్తి చేసిన రెవిన్యూ అధికారులు పురావస్తు శాఖకే ఫిర్యాదు చేసుకోవాలని చెప్పారు.

# అనంతబాబు విషయంలో ఆచితూచి అడుగులు

కాకినాడ, జూన్ 7,ఎమ్మెల్సీ అనంతబాబు విషయంలో ఏం చేయాలో పోలీసులకూ తెలియడం లేదు. మామూలుగా ఓ ఎమ్మెల్సీ మర్డర్ చేసినట్లుగా అంగీకరిస్తే పోలీసులు ఎంత హ డావుడి చేస్తారు. అలా అరెస్ట్ చేయగానే ఇలా కస్టడీ పిటిషన్ వేశారు. కస్టడీలోకి మూడు రోజులో.. నాలుగు ?జులో తీసుకుంటారు. ప్రతీ రోజూ విచారణలో ఫలానా విషయం చెప్పారంటూ పోలీసులు మసాలా దట్టించి మరీ మీడియాకు లీక్ చేస్తారు. కానీ ఇక్కడ ఎమ్మెల్సీ విషయంలో ఆయనేం చెప్పారో అదే రాసుకున్న పోలీసులు .. కనీసం కస్టడీకి కూడా తీసుకోవడం లేదు. రిమాండ్ ముగియడంతో ఆయనను కోర్టులో హాజరు పరిచారు. అయితే పోలీసులు ఏమీ చెప్పకపోతే బెయిలిచ్చేస్తారు. కానీ బెయిల్ పిటిషన్ పెండింగ్‌లో ఉంది. దీంతో తప్ప ని సరి అన్నట్లుగా రిమాండ్‌ను పొడిగించాలనే పిటిషన్ దాఖలు చేశారు. దీంతో రిమాండ్ పొడిగించారు. మంగళవారం ఆయన బెయిల్ పిటిషన్ విచారణకు వస్తుంది. బెయిలిస్తారో లేదో తర్వాత విషయం.. కానీ కేసు నమోదు మాత్రం ఉద్దేశపూర్వకంగా చేసిన హత్య కాదన్నట్లుగా ఉంది. ఉద్దేశపూర్వకంగానే చేశారని.. నిరూపించాడనికి పోలీసులు ఎలాంటి ప్రయత్నాలు చేయడం లేదు. మీడియానే పోలీసులు చెప్పిన "స్టోరీ" కరెక్టా కాదా అన్న దర్యాప్తు చేసింది. అంతా తప్పేనని తేలింది. అయినా పోలీసులు ఏ మాత్రం ఫీల్ కాకుండా ఇతర దర్యాప్తు విషయంలో.. నెమ్మదిగా ఉంటున్నారు. అదే సమయంలో సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారని టీడీపీ నేతల్ని రోజుల తరబడి విచారణ జరుపుతూండటం.. ఇక్కడ కొసమెరుపు. అందుకే పోలీసుల వ్యవహారశైలి.. వారు అమలు చేస్తున్న చట్టంపై అనేక విమర్శలు తరచూ వస్తున్నాయి

# విద్యార్థిని విద్యార్థులు తల్లిదండ్రులు కొట్టడం కానీ తిట్టడం వద్దు

**ఇతరులతో పోల్చకండి, వారిలో మనోధైర్యం నింపండి..**

**తాతిరెడ్డి తులసిరెడ్డి సీనియర్ న్యాయవాది**

నంద్యాల జూన్ 07 స్థానిక నంద్యాల పట్టణంలోని సీనియర్ న్యాయవాది తాతి రెడ్డి తులసి రెడ్డి మాట్లాడుతూ..... విద్యార్థుల తల్లిదండ్రులకు విద్యార్థినీ విద్యార్థి తల్లిదండ్రులకు నా యొక్క మనవి దయచేసి ఈ రోజు వచ్చిన 10వ తరగతి పరీక్ష ఫలితాలు దృష్టిలో పెట్టుకుని పిల్లల్ని తిట్టడం గాని చేయకండి , వారిని ఇతరులతో పోలుస్తూ నిరుత్సాహ పరచకుండా వారిలో మనోధైర్యాన్ని నింపండి .రాబోయే రోజుల్లో విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుంది. అనేక రంగాలు ఉన్నాయి ఏ రంగంలో అయినా విద్యార్థులు రాణించవచ్చు అందుకు పిల్లలను దయచేసి ప్రేమగా చూడాలని వారిని మానసికంగా ఇబ్బంది పెట్టకుండా వారిలో ఉన్నటువంటి సృజనాత్మకతను వెలికి తీయాలని కోరుకుంటున్నానని వారు తెలిపారు.

# భార్యను హతమార్చిన భర్త

తిరుపతి తిరుపతి జిల్లా వాకాడు మండలం కొండాపురం వడ్డి పాలెం దారుణం జరిగింది. భార్య ధనమ్మ(55)ను భర్త రమణయ్య కిరాతకంగా హత్య చేసాడు. 15 సంవత్సరాల క్రితమే విడాకులు తీసుకుని విడిగా జీవిస్తున్న ధనమ్మ,రమణయ్య లు 2 నెలల క్రితం మళ్ళీ కలిసి ఒకటిగా ఉంటూ నెల క్రితం మళ్ళీ గొడవలు పడి విడిగా జీవిస్తున్నారు. ధనమ్మ,రమణయ్య కు ముగ్గురు పిల్లలు,అదే గ్రామం లో ఒక కొడుకు తో కలిసి జీవిస్తున్న దనమ్మ ను రమణయ్య మంగళవారం తెల్లవారు జామున ఇనుప రాడ్డు తో తల పగలగొట్టి అతి కిరతంగా చంపినట్టు సమాచారం. నిందితుడు పరారీలో వున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# శ్రీవారి ఆలయ మహా సంప్రోక్షణ కు విస్తృత ఏర్పాట్లు

అమరావతి అమరావతిలో నిర్మించిన శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో జూన్ 9వ తేదీ ఉదయం 7:30 నుండి 8:30 గంటల వరకు మిధున లగ్నంలో ప్రాణప్రతిష్ఠ, మహా సంప్రోక్షణ కార్యక్రమం జరుగుతుందని ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి అవకాశం ఉండటంతో విస్తృతంగా ఏర్పాట్లు చేపడుతున్నామని టీటీడీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు వై వి. సుబ్బారెడ్డి తెలిపారు. టీటీడీ ఈవో ఏవి . ధర్మారెడ్డి ,జేఈఓ వీరబ్రహ్మం తో కలిసి సోమవారం ఇక్కడ ఆలయంలో జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు.

# ఏపీలో కాక రేపుతున్న సీఎం పదవి

విజయవాడ, జూన్ 7,ఏపీలో ముఖ్యమంత్రి రేసు కాక రేపుతోంది. ఎన్నికలకు రెండేళ్ళ ముందే ముఖ్యమంత్రి అంశం చర్చకు రావడం ఒకింత ఆశ్చర్యం కలిగిస్తున్నా ఈ చర్చ వెనుక మూడు పార్టీల రాజకీయ చదరంగం వుండడంతో పరిస్థితి ఆసక్తికరంగా మారుతోంది. రెండు రోజుల క్రితం జనసేన ఇక ఏ మాత్రం త్యాగాలు చేయబోదని, పొత్తుల కోసం సీట్ల త్యాగాలు ఇక వుండవని జనసేన అధినేత పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించిన తర్వాత సీఎం రేసుపై చర్చ మొదలైంది. దానికి తగ్గట్టుగా బీజేపీ, జనసేన పార్టీల నేతలు ఎవరి వ్యూహాలకు అనుగుణంగా వారు ప్రకటనలు చేస్తున్నారు. బీజేపీ, జనసేన మధ్య మిత్రబంధం కొనసాగుతుందన్న సంకేతాలిస్తూనే సీఎం సీటు మాదేనని పవన్ పార్టీ శ్రేణులు ఖరాఖండిగా చెబుతున్నారు. రాష్ట్ర శాసనసభలో ఒక్కటంటే ఒక్క ఎమ్మెల్యే కూడా లేని జనసేన, బీజేపీ వచ్చే ఎన్నికల్లో విజయం సాధించి ఏకంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని భావిస్తున్నారు. ముఖ్యమంత్రి అభ్యర్థి తమ అధినేత పవన్ కల్యాణేనని జనసేన వర్గాలు చెబుతున్నాయి. 2014లో ఏర్పాటైన జనసేన పార్టీ.. ఆనాటి ఎన్నికల్లో పోటీకి దూరంగా వుండిపోయింది. టీడీపీ, బీజేపీల పక్షాన పవన్ ప్రచారం చేశారు. 2019 ఎన్నికలు వచ్చే సరికి జనసేన ఒంటరిగా బరిలోకి దిగింది. పవన్ కల్యాణ్ రెండు చోట్ల పోటీచేసినా ఒక్క చోట కూడా విజయం సాధించలేకపోయారు. జనసేన పార్టీ తరపున ఒక్క ఎమ్మెల్యే మాత్రమే గెలిచారు. తూర్పుగోదావరి జిల్లా రాజోలు నుంచి రాపాక వరప్రసాద్ఒక్కరే జనసేన పార్టీ తరపున విజయం సాధించి, అసెంబ్లీలో అడుగుపెట్టారు. కానీ ఆయన జనసేన పార్టీని వదిలి అధికార వైసీపీలో చేరడంతో రాష్ట్ర అసెంబ్లీలో జనసేన బలం సున్నాకు పడిపోయింది. 2024 అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా ఇటీవల జనసేన పార్టీ తమ కార్యకలాపాలను ముమ్మరం చేసింది. ఈ నేపథ్యంలోనే పార్టీ శ్రేణులనుద్దేశించి పవన్ కల్యాణ్.. జూన్ నాలుగో తేదీన ప్రసంగించారు. పొలిటికల్ పొత్తులపై మూడు ఆప్షన్లున్నాయన్నారు. ఒకటి బీజేపీ, జనసేన, టీడీపీలు కలిసి పోటీ చేయడం ద్వారా ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు చీలకుండా చూసుకోవడం.. రెండోది బీజేపీ, జనసేన పార్టీ కలిసి పోటీ చేయడం.. మూడోది బీజేపీకి సైతం దూరం జరిగి సింగిల్‌గా ఎన్నికల్లో బరిలోకి దిగడం.. ఇలా మూడు ఆప్షన్లున్నాయని వెల్లడించిన పవన్ కల్యాణ్.. పొత్తుల కోసం త్యాగాలు మాత్రం వుండవని కుండబద్దలు కొట్టారు. పార్టీ ఆవిర్భావం నుంచి జనసేన త్యాగాలు చేస్తూ వస్తోందని.. ఇకపై త్యాగాలుండవని ఆయన చెప్పుకొచ్చారు. నిజానికి మొన్నటి జనవరి నుంచి జనసేనతో జత కట్టేందుకు టీడీపీ యత్నాలు ప్రారంభించింది. జనవరి 5న కుప్పంలో పర్యటించిన చంద్రబాబు.. జనసేన విషయంలో తమది వన్ సైడ్ లవ్ అన్నారు. ఆ సందర్భంలో స్పందించిన పవన్ కల్యాణ్.. ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు చీలకుండా చూసే బాధ్యత విపక్షాలపై వుందన్నారు. తద్వారా టీడీపీలో పొత్తుకు అవకాశం వుందన్న సంకేతాలిచ్చారు. మళ్ళీ ఇటీవల టీడీపీ, జనసేన పార్టీల పొత్తుపై పెద్ద ఎత్తున చర్చ మొదలైంది. ఓ దశలో టీడీపీతో కలిసేందుకు తాము సిద్ధమన్నారు పవన్. కానీ వారం రోజుల్లో పరిస్థితిలో మార్పు కనిపిస్తోంది. బీజేపీతో కలిసి ఎన్నికలు ఎదుర్కొంటామని జనసేన వర్గాలు చెప్పడం మొదలుపెట్టాయి. ఒకవేళ బీజేపీకి ఓకే అయితే.. టీడీపీని తమ కూటమిలో చేర్చుకుంటామని.. కానీ సీట్ల విషయంలో మాత్రం తమదే తుది నిర్ణయం కావాలని జనసేన వర్గాలు చెబుతున్నాయి. తెలుగుదేశం పార్టీకి ఎన్ని సీట్లు ఇవ్వాలో తామే నిర్ణయిస్తామని అంటున్నారు జేఎస్పీ నేతలు. అంటే సీఎం సీటు రావాలంటే తమ కూటమిలో అతిపెద్ద పార్టీగా నిలవాల్సిన అవసరాన్ని జనసేన నేతలు గుర్తించారన్నమాట.బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఏపీకి వచ్చిన నేపథ్యంలో మరోసారి బీజేపీ, జేఎస్పీల మధ్య పొత్తుపై చర్చోపచర్చలు మొదలయ్యాయి. 2014 ఫలితాల నేపథ్యాన్ని దృష్టిలో పెట్టుకుంటారా బీజేపీ నేతలు..లేక 2019 చేదు అనుభవాలనే పరిగణనలోకి తీసుకుంటారా.. అన్న అంశంపై చర్చలు జరుగుతున్నాయి. 2014లో కలిసి పోటీ చేసిన టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలు అధికారాన్ని హస్తగతం చేసుకున్నాయి. ఆనాటి ఎన్నికల్లో జనసేన పోటీ చేయలేదు. దాంతో ఎన్నికల అనంతరం టీడీపీ ఏర్పాటు చేసిన ప్రభుత్వంలో బీజేపీ పాలు పంచుకున్నది. అయితే 2019 ఎన్నికల్లో బీజేపీతో పొత్తు దెబ్బతీస్తుందని అంచనా వేసిన చంద్రబాబు.. కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలపైనా, బీజేపీ నేతలపైనా విరుచుకుపడడం మొదలు పెట్టారు. బీజేపీతో కలిసి వున్నప్పుడు ఏపీకి ప్రత్యేక హోదా అవసరం లేదన్న చంద్రబాబు. చివరికి అదే అంశం ఆధారంగా నరేంద్ర మోదీ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. ఆఖరుకు చిరకాల ప్రత్యర్థి అయిన కాంగ్రెస్ పార్టీతో పొత్తుదాకా వెళ్ళారు చంద్రబాబు. 2019లో కేంద్రంలో కాంగ్రెస్ సారథ్యంలో యుపీఏ సర్కార్ ఏర్పాటవుతుందని భావించిన చంద్రబాబు అంచనా ఘోరంగా తప్పింది. దాంతో 2019 ఎన్నికల తర్వాత మళ్ళీ బీజేపీతో కలిసేందుకు చంద్రబాబు పలు మార్లు విఫలయత్నం చేశారు. మోదీ, అమిత్ షాలను కలిసేందుకు కూడా చంద్రబాబు ప్రయత్నించినప్పటికీ వారిద్దరు అపాయింట్‌మెంటు కూడా ఇవ్వలేదని పలు మీడియా సంస్థలు రాశాయి. ఏది ఏమైనా 2024లోగా వీలైతే బీజేపీ, జనసేన పార్టీలతోను.. బీజేపీ అందుకు ససేమిరా అంటే కనీసం జనసేన పార్టీతో అయినా పొత్తు పెట్టుకోవాలని చంద్రబాబు భావిస్తున్నారు. అందుకే 2022 జనవరి నుంచి ఇప్పటి దాకా చంద్రబాబు తన అభిలాషను ప్రత్యక్షంగాను, పరోక్షంగా పలుమార్లు వెల్లడించారు కూడా. పవన్ కల్యాణ్ కూడా ఓ దశలో చంద్రబాబుకు దగ్గరవుతున్నట్లు సంకేతాలిచ్చారు. కానీ కారణాలైతేనేం ప్రస్తుతానికి బీజేపీని కాదని టీడీపీతో జత కట్టేందుకు పవన్ సుముఖంగా లేరని తెలుస్తోంది.మెజార్టీ నియోజకవర్గాల్లో జనసేనపార్టీకి విజయావకాశాలను ప్రభావితం చేసే స్థాయిలో ఓటర్లున్నారు. దాంతో వైసీపీని ఓడించాలంటే జనసేన పార్టీతో పొత్తు అవసరమని టీడీపీ వర్గాలు అనుకుంటున్నాయి. చంద్రబాబు పర్యటనకొచ్చినపుడు వివిధ జిల్లాల దేశం శ్రేణులు జనసేనతో పొత్తు అంశాన్ని ప్రస్తావిస్తూ వస్తున్నారు. అందులో భాగంగానే జనవరిలో కుప్పానికి వెళ్ళిన చంద్రబాబుకు అలాంటి సందర్భమే ఎదురైతే ఆయన " వన్ సైడ్ లవ్" అంటూ ఛలోక్తి విసిరారు. టీడీపీతో కల్వడాన్ని బీజేపీ వ్యతిరేకిస్తున్నప్పటికీ.. మొన్నటి లోకల్ బాడీస్ ఎలెక్షన్లలో పలు చోట్ల టీడీపీ, జనసేన పార్టీతు లోపాయకారీగా కలిసి పని చేసినట్లు కథనాలొచ్చాయి. ఈమధ్యకాలంలో ఒంగోలులో నిర్వహించిన మహానాడు విజయవంతం కావడంతో టీడీపీ శ్రేణుల్లో ఉత్సాహం ఇనుమడించింది. వచ్చే ఎన్నికల్లో వార్ వన్ సైడ్ అంటూ చంద్రబాబు మహానాడులో చేసిన ప్రసంగంతో మరోసారి పొలిటికల్ పొత్తులపై చర్చ మొదలైంది. అయితే.. పవన్ కల్యాణ్ చేసిన ప్రకటన తర్వాత మాత్రం టీడీపీ వర్గాల నుంచి ఎలాంటి స్పందనా వ్యక్తం కాలేదు. ముఖ్యంగా 2014లో పొత్తు ఉన్నప్పటికీ తాము పోటీ చేయకుండా టీడీపీకి సహకరించామని, ఈసారి టీడీపీ తగ్గాల్సిన అవసరం వుందన్నది జనసేన భావనగా కనిపిస్తోంది. పొలిటికల్ పొత్తులపై జనసేన వర్గాల అభిప్రాయాలపై బీజేపీ నాయకత్వం స్పందించింది. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో జేఎస్పీతో కలిసే పోటీకి దిగుతామని బీజేపీ నేతలు ప్రకటించారు. పవన్ కల్యాణే తమ కూటమి సీఎం అభ్యర్థి అని ఏపీ బీజేపీ అధ్యక్షుడు సోము వీర్రాజు ఇదివరకే ప్రకటించారు.

# తవణంపల్లి తాసిల్దార్ కార్యాలయం పై ఏసీబీ దాడులు

పూతలపట్టు చిత్తూరు జిల్లా, పూతలపట్టు నియోజకవర్గం, తవణంపల్లి మండలంలో తాసిల్దార్ కార్యాలయం పై ఏసీబీ దాడులు. అవినీతి నిరోధకశాఖ డీఎస్పీ జనార్ధన్ నాయుడు ఆధ్వర్యంలో నలుగురు ఇన్స్పెక్టర్ల బృందం సర్ప్రైజ్ విజిట్ తాసిల్దార్ కార్యాలయం పై అధికంగా ఫిర్యాదులు రావడంతో ఆకస్మిక తనిఖీలు చేపట్టిన ఏసీబీ అధికారులు. రికార్డులను పరిశీలిస్తున్న ఏసీబీ అవినీతి నిరోధక శాఖ అధికారులు డిఎస్పీ జనార్ధన్ నాయుడు తనిఖీలు నిర్వహించి పలు రికార్డులు స్వాధీనం చేసుకున్నారు. 14400కు వచ్చిన ఎనిమిది ఫిర్యాదు మేరకు చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గం , తవణంపల్లి మండలం, తాసిల్దార్ కార్యాలయం పైన దాడులు నిర్వహించడం జరిగిందని ఏసిబి డిఎస్పి జనార్ధన్ నాయుడు తెలిపారు. సోమవారం తాసిల్దార్ కార్యాలయంలో ఆకస్మిక దాడులు నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ సీఎం జగన్ ఏర్పాటు చేసిన 14400 యాప్ ద్వారా 2021 22 సంవత్సరంలో స్పందనకు సంబంధించి ఎనిమిది ఫిర్యాదులు అందాయని దీని ఆధారంగా తవణంపల్లి తాసిల్దార్ కార్యాలయంలో పలు రికార్డులను తనిఖీ చేయడం జరిగిందన్నారు. రైతులకు పాసు పుస్తకాలు మ్యుటేషన్ కొరకు దరఖాస్తు చేసుకోగా వారికి లంచం ఇస్తే గాని పాసుపుస్తకాలు ఇవ్వకుండా అధికారులు వేధిస్తున్నారని పలు రకాలైన ఫిర్యాదుల పైన దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు అవినీతి అంతానికి లంచాల నిర్మూలనకు 14400 యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సి.ఐ, లు ఈశ్వర్, సునీల్, ప్రతాప్ రెడ్డి, నాగేంద్ర మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# కొత్తగా వెలుగు చూసిన నోరో వైరస్ కేసులు



తిరువనంతపురం జూన్ 7 కేరళను కొత్త వైరస్‌లు వెంటాడుతున్నాయి. తాజాగా నోరో వైరస్ కేసులు వెలుగు చూశాయి. తిరువనంతపురం,

**అప్రమత్తమయిన రాష్ట్ర వైద్యాధికారులు**

విజింజంలో స్కూలుకు వెళ్లే ఇద్దరు పిల్లలకు నోరో వైరస్ సోకింది. దీంతో ఆ రాష్ట్ర వైద్యాధికారులు అప్రమత్తమయ్యారు. నోరో వైరస్ కేసులపై సమగ్ర సమాచారాన్ని కోరారు. 2021 జూన్‌లో కేరళలోని అలప్పుజ జిల్లాలో తొలి నోరో వైరస్ కేసు వెలుగు చూసింది. డయేరియాకు సంబంధించిన ఈ వైరస్ కేసులు గత ఏడాది 950 నమోదయ్యాయి. ఈ వైరస్ వ్యాప్తి నెలన్నర పాటు కొనసాగింది. వందల సంఖ్యలో పిల్లలు దీని బారిన పడ్డారు.కాగా, కలుషిత నీటి వల్ల నోరో వైరస్ వ్యాప్తిస్తుందని వైద్య నిపుణులు తెలిపారు. దీని వల్ల ఉదర సంబంధ సమస్యలు, విరోచనాలు, వాంతులు వంటి లక్షణాలు ఉంటాయని చెప్పారు. 92 శాతం కేసులు అవుట్ పేషంట్లేనని, స్వీయ జాగ్రత్తలతో ఈ రోగం నుంచి బయటపడవచ్చని వివరించారు. పౌష్టికాహార లోపం ఉన్న వారిలో దీర్ఘ కాలంపాటు లక్షణాలు ఉంటాయని వెల్లడించారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రతి ఏటా సుమారు 68.5 కోట్ల మంది ఈ వ్యాధి బారిన పడుతుంటారని, ఐదేళ్లలోపు పిల్లల కేసులు సుమారు 20 కోట్లని గణాంకాల ద్వారా తెలుస్తుందన్నారు.

# శ్రీశైల దేవస్థానం అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షా సమావేశం

శ్రీశైలం శ్రీశైల దేవస్థానం అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షా సమావేశం నిర్వహించబడింది.దేవస్థాన ధర్మకర్తల మండలి అధ్యక్షులు రెడ్డివారి చక్రపాణిరెడ్డి, కార్యనిర్వహణాధికారివారు. ఎస్. లవన్న, పలువురు ధర్మకర్తల మండలి సభ్యులు, దేవస్థాన అన్ని శాఖల అధిపతులు, అన్ని విభాగాల పర్యవేక్షకులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.ముందుగా సమావేశ ప్రారంభంలో కార్యనిర్వహణాధికారి మాట్లాడుతూ ఇటీవల దేవస్థానములో పూర్తి చేయబడిన వివిధ అభివృద్ధి పనులు, ప్రసాద్ పథకం కింద్ర చేపట్టబడిన అభివృద్ధి పనులు, ప్రస్తుతం జరుగుతున్న గణేశ సదన్ నిర్మాణ పనులు, పంచమకాల పునరుద్ధరణ మొదలైన అంశాల గురించి వివరించారు. అదేవిధంగా సమీప భవిష్యత్తులో చేపట్టాలని ప్రతిపాదించిన మాడవీధుల సుందరీకరణ మొదలైన కార్యక్రమాలను గురించి కూడా వివరించారు.ఇంకా కార్యనిర్వహణాధికారి మాట్లాడుతూ ప్రస్తుతం భక్తులకు కల్పిస్తున్న వసతి,సదుపాయాలు, దర్శనం ఏర్పాట్లు, పరోక్షసేవలు మొదలైనవాటిని కూడా వివరించడం జరిగింది.అనంతరం ధర్మకర్తల మండలి అధ్యక్షులు మాట్లాడుతూ దేవస్థానం అభివృద్ధికి ధర్మకర్తల మండలి పూర్తి సహాయ సహకారాలను అందిస్తుందన్నారు. అందరూ కూడా దేవస్థానం అభివృద్ధికి పాటు పడాలని సూచించారు. అవకాశాన్ని బట్టి భక్తులకు కల్పిస్తున్న ఆన్లైన్ సేవల విస్తరణ పట్ల మరిన్ని చర్యలు. చేపట్టాలని సూచించారు.తరువాత పలు ధర్మకర్తల మండలి సభ్యులు ప్రసంగిస్తూ దేవస్థానం అభివృద్ధికి సంబంధించి పలు సూచనలను, సలహాలను అందజేశారు.కాగా దేవస్థానం అభివృద్ధిలో భాగంగా ధర్మకర్తల మండలి సభ్యులు మరియు ప్రత్యేక ఆహ్వానితులతో దేవస్థాన ఆయా విభాగాలకు సంబంధించి ధర్మకర్తల మండలి సభ్యుల చేత ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేయబడ్డాయి.దేవస్థానం ఆగమపాఠశాల, ఇంజనీరింగ్, వసతి కల్పన మరియు ప్రోటోకాల్, రెవెన్యూ, అన్నప్రసాద వితరణ, గోశాల మరియు ఉద్యానవనాలు, పడితరం స్టోరు, ఇంజనీరింగ్ స్టోరు, పరిపాలనా మరియు భద్రతా విభాగం, ప్రచురణలు, సాంస్కృతిక కార్యక్రమాలు మరియు స్టేషనరీ, విరాళాలు మరియు ఆర్జితసేవలు, దేవస్థానం వైద్యశాల, పెట్రోల్ బంకు మరియు వంటగ్యాస్ విభాగం, ప్రసాదాలు, పారిశుద్ధ్యం, గణాంక విభాగం, వివిధ వస్తువుల కొనుగోళ్లు సంబంధించి మొత్తం 16 కమిటీలు ఏర్పాటు చేయబడ్డాయి.ఈ కమిటీలలో ఒక్కొక్క కమిటీకి ముగ్గురు ధర్మకర్తల మండలి సభ్యులు బృందంగా ఉంటారు.కొనుగోళ్ళకు సంబంధించి మాత్రం అయిదు మంది సభ్యులతో కమిటీ ఏర్పాటు చేయడం జరిగింది.

# హైదరాబాద్ నగరంలో మరో ఘోరం

**కార్ఖానాకు చెందిన ఓ బాలికపై ఐదుగురు యువకులు సామూహిక లైంగికదాడి**

హైదరాబాద్ జూన్ 7 హైదరాబాద్ నగరంలో మరో ఘోరం జరిగింది. కార్ఖానాకు చెందిన ఓ బాలికపై ఐదుగురు యువకులు సామూహిక లైంగికదాడికి పాల్పడ్డారు. ధీరజ్, రితేశ్ అనే ఇద్దరు యువకులు.. ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ బాలికను పరిచయం చేసుకున్నారు. ఆమెతో ఆ ఇద్దరు యువకులు తమపై ఓ మంచి అభిప్రాయం ఏర్పడేలా చాటింగ్ చేశారు. ఆ తర్వాత బాలికకు మాయమాటలు చెప్పి శారీరకంగా లోబర్చుకున్నారు. అయితే ఆ సమయంలో ఆమెకు తెలియకుండా వీడియోలు తీశారు. ఆ వీడియోలను అడ్డుగా పెట్టుకుని పలుమార్లు లైంగికదాడికి పాల్పడ్డారు.వీడియోలు ఇస్తామని ఇటీవల బాలికను పిలిచి మరోసారి తన స్నేహితులతో కలిసి సామూహిక లైంగికదాడికి పాల్పడ్డారు. ఈ క్రమంలో బాలిక మానసికంగా కుంగిపోయింది. ఈ విషయాన్ని గమనించిన తల్లిదండ్రులు.. ఆమెను మానసిక వైద్యుడి వద్దకు తీసుకెళ్లారు. తనకు జరిగిన అవమానాన్ని మానసిక వైద్యుడికి చెప్పింది. దీంతో బాలిక పేరెంట్స్ మే 30వ తేదీన పోలీసులకు ఫిర్యాదు చేశారు.

# ఖైదీ ఎమ్మెల్సీకి విఐపి సౌకర్యాలు

విజయవాడ న్యాయమూర్తి ఆదేశాలు లేకుండా రాజమండ్రి సెంట్రల్ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబుకు వి. ఐ.పి సౌకర్యాలు కల్పిస్తున్న జైలు అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ జైళ్ల విభాగం డీజీకి తెదేపా నేత వర్ల రామయ్య లేఖ రాసారు. దళితుడి హత్యకేసులో అరెస్టు అయ్యి రాజమండ్రి జైల్లో జుడీషియల్ కస్టడీలో ఉన్న వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు కు వి. ఐ.పి రాచమర్యాదలు చేస్తున్నట్టుగా తెలుస్తున్నది. × అనంతబాబు పెద్ద నేర చరితుడు. ఇంత పెద్ద నేరస్తుడికి రాజమండ్రి సెంట్రల్ జైలు సిబ్బంది, అధికారులు స్టార్ హోటల్ సౌకర్యాలు కల్పిస్తున్నారని తెలియడం చాలా బాధాకరం. రిమాండ్ ఖైదీకి అటువంటి సౌకర్యాలు కల్పించేందుకు అనుమతి ఇవ్వలేదని కోర్టు అధికారులు తెలియజేస్తున్నారు. కానీ, నిబంధనలకు విరుద్ధంగా అనంతబాబుకు ప్రత్యేక గది కేటాయించారట. ఇది నిజమా? అనంతబాబు రెండు సెల్ఫోన్లతో నిత్యం బాహ్య ప్రపంచంతో సంభాషిస్తున్నట్లు తెలుస్తోంది. నిజమా? అనంతబాబును కలిసేందుకు ఎలాంటి రికార్డులు లేకుండానే సందర్శకులను అనధికారికంగా భారీ సంఖ్యలో అనుమతిస్తున్నారట. నిజమా? × రాజమండ్రి స్టార్ హోటల్ నుంచి అనంతబాబుకు రోజు భోజనం వస్తోందట. నిజమా? × అనంత బాబు జైలునే కేంద్రంగా మార్చుకుని పలు వివాదాలకు పంచాయతీలు చేస్తున్నాడట. నిజమా? × నేరస్థులను క్రమశిక్షణలో పెట్టి వారిని నిరంతరం నిఘాలో ఉండేలా చూసుకోవాల్సిన బాధ్యత జైళ్ల శాఖది. అవునా? కాదా? × కానీ అనంత బాబు విషయంలో అలా జరగడం లేదు. ఎందుకనీ? నిబంధనలకు విరుద్ధంగా అనంతబాబుకు ప్రత్యేక సౌకర్యాలు కల్పిస్తున్న అధికారులపై విచారణ చేసి చర్యలు తీసుకోండని అన్నారు.

# సీఐడీ పోలీసులముందు హాజరయిన టీడీపీ నేత గౌతు శిరీష

గుంటూరు టీడీపీ మహిళా నేత గౌతు శిరీషకు ఇచ్చిన నోటీసుల్లో మరో ట్విస్ట్ చోటు చేసుకుంది. మొదట ఇచ్చిన నోటీసు లో మంగళగిరి సీఐడీ రాష్ట్ర కార్యా లయంలో విచారణ కు రావాలని అధికారులు పేర్కొన్నారు.అయితే ఈ నేపథ్యంలో.. టీడీపీ కేంద్ర కార్యాలయం నుంచి మంగ ళగిరి సీఐడీ కార్యాలయానికి బయలుదేరిన శిరీషకు మళ్ళీ సీఐడీ అధికారుల ఫోన్ చేసి.. మంగళగిరి కార్యా లయానికి కాకుండా గుంటూరు కార్యాలయం రండి అని సీఐడీ అధికారులు కోరారు. అయితే..గౌతు శిరీషతో పాటు సీఐడీ కార్యాలయానికి అనుచరులు చేరుకున్నా రు.ఈ క్రమంలో మంగళగిరి సీఐడీ కార్యాలయం వద్ద కొద్దిసేపు ఉద్రిక్తత వాతావరణం చోటు చేసుకుంది. దీంతో.. గుంటూరు సీఐడీ కార్యాలయానికి వెళ్ళాలని శిరీషకి పోలీసులు సూచించారు. అయితే.. తనకిచ్చిన నోటీసుల్లో మంగళగిరి సీఐడీ కార్యాలయమనే ఉంది కాబట్టి.. తానిక్కడే విచారణకు హాజరవుతానన్న శిరీష స్పష్టం చేశారు. చేసేదేం లేక శిరీషతో పాటు ఆమె తరు పు న్యాయవాదిని మాత్రమే పోలీసులు కార్యాలయం లోకి అనుమతించారు. ఈ సందర్భంగా గౌతు శిరీష మాట్లాడుతూ.. సోషల్ మీడియా పోస్టింగుల పేరుతో ప్రభుత్వం వేధిస్తోందని, మహనాడు తర్వాత టీడీపీపై మరిన్ని వేధింపులు పెరిగాయని ఆమె ఆరోపించారు. ఫేక్ పోస్టింగులతో టీడీపీని ఇబ్బంది పెట్టే ప్రయత్నం చేస్తున్నారని మేం ఫిర్యాదులిచ్చినా పోలీసులు పట్టిం చుకోవడం లేదని మండిపడ్డారు.

# రిజర్వాయర్ లో దూకిన విద్యార్థి

విశాఖపట్నం విశాఖ జిల్లాలో టెన్త్ క్లాస్ లో ఫెయిల్ కావడంతో పేరెం ట్స్ మందలించడంతో సాయి అనే విద్యార్థి కన్పించ కుండా పోయాడు.మేఘాద్రిగడ్డ రిజర్వాయర్ వద్ద సాయి సెల్ ఫోన్, చెప్పులు గుర్తించారు. పోలీసులు సాయి కోసం గాలిస్తున్నారు. సాయి ఆత్మహత్య చేసుకొ న్నాడా అనే అనుమానాలు కూడా వ్యక్తమౌ తున్నాయి.10వ తరగతి పలితాల్లో ఫెయిల్ కావడంతో తల్లిదం డ్రులు దలించడం తో సాయి అనే విద్యార్థి అదృశ్యమ య్యాడు.విశాఖ జిల్లాలోని వేపగుంట అప్పల నర్సయ్య కాలనీకి చెందిన టెన్త్ క్లాస్ విద్యార్థి సాయి అదృశ్యమ య్యాడు.టెన్త్ క్లాస్ పరీక్షల్లో సాయి రెండు సబ్జెక్టుల్లో పెయిల్ అయ్యాడు. ఈ విషయాన్ని గుర్తించిన సాయిని మందలించారు. దీంతో సాయి ఇంటి నుండి వెళ్లిపో యాడు. మేఘాద్రిగడ్డ డ్యామ్ వద్ద సాయి సెల్ ఫోన్, చెప్పులను పోలీసులు గుర్తించారు.

# కర్నూలు జిల్లాలో వైయస్సార్ యంత్ర సేవా పథకం






**241 రైతు గ్రూపుల బ్యాంకు ఖాతాలకు రూ.8.38 కోట్ల సబ్సిడీ జమ**

**-: కర్నూలు జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు**

**మెగా పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ,ఎమ్మెల్యేలు ఇతర ప్రజాప్రతినిధులు**

కర్నూలు జూన్,07 : వైఎస్సార్ యంత్ర సేవా పథకంలో భాగంగా 241 రైతు గ్రూపులకు 157 ట్రాక్టర్లు, 11 కంబైన్ హార్వెస్టర్లు, 73 ఇతర వ్యవసాయ పరికరాల పంపిణీ తో పాటు రూ.8.38 కోట్లు 241 రైతు గ్రూపు బ్యాంకు ఖాతాలకు జమ అయిందని కర్నూలు జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు పేర్కొన్నారు×మంగళవారం ఎస్టీబీసీ కళాశాల మైదానంలో వైఎస్సార్ యంత్ర సేవా పథకం కింద ప్రభుత్వం రైతులకు ట్రాక్టర్లు, కంబైన్ హార్వెస్టర్లు,ఇతర వ్యవసాయ పరికరాల మెగా పంపిణీ కార్యక్రమం జరిగింది .. . ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తో పాటు కర్నూలు పార్లమెంట్ సభ్యులు సంజీవ్ కుమార్, ఎమ్మెల్యేలు బాల నాగిరెడ్డి, కాటసాని రాంభూపాల్ రెడ్డి, హఫీజ్ ఖాన్, సాయి ప్రసాద్ రెడ్డి,కంగాటి శ్రీదేవి, డాక్టర్ సుధాకర్, నగర మేయర్ బివై రామయ్య, జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ బెల్లం మహేశ్వర రెడ్డి, జాయింట్ కలెక్టరు ఎస్.రామ్ సుందర్ రెడ్డి, కర్నూలు నగర పాలక సంస్థ కమిషనర్ భార్గవ తేజ, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ ప్రభాకర్ రెడ్డి, కెడిసిసి బ్యాంక్ ఛైర్మన్ మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారుగుంటూరు లో వైఎస్సార్ యంత్ర సేవా పథకం కింద ప్రభుత్వం రైతులకు ట్రాక్టర్లు, కంబైన్ హార్వెస్టర్లు మెగా పంపిణీని కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారభించిన అనంతరం రైతు గ్రూప్ బ్యాంక్ ఖాతాలకు సబ్సిడీ మొత్తాన్ని బటన్ నొక్కి సీఎం వైయస్ జగన్ మోహన్ రెడ్డి రైతుల ఖాతాల్లో జమ చేశారు.ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా తిలకించారు.అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు పెట్టుబడిని తగ్గించి అధిక దిగుబడి సాధించేందుకు ప్రభుత్వం వైఎస్సార్ యంత్ర సేవా పథకం అమలు చేస్తోందన్నారు.. పేద రైతులకు ఆధునిక వ్యవసాయ యంత్ర పరికరాలను గ్రామంలోనే ఆర్ బి కే ల వద్దే తక్కువ అద్దె కే అందుబాటులోకి తెచ్చి సాగు వ్యయం తగ్గించడంతో పాటు నికర ఆదాయం పెంచాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఒక్కో ట్రాక్టర్ ధర 15 లక్షల రూపాయలు కాగా ఇందులో 50 శాతం తక్కువ వడ్డీతో బ్యాంకు రుణం, 40 శాతం సబ్సిడీ ని ప్రభుత్వం అందిస్తోన్నదన్నారు కర్నూలు పార్లమెంటు సభ్యులు డాక్టర్ సంజీవ్ కుమార్ మాట్లాడుతూ మన రాష్ట్ర ప్రభుత్వం రైతుల పక్షపాతి అని రైతులకు తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి సాధించాలని ఉద్దేశంతో రైతులకు అవసరమైన అధునాతన వ్యవసాయ పనిముట్లను కమ్యూనిటీ హైరింగ్ సెంటర్ ద్వారా తక్కువ అద్దె తో రైతులకు అందజేస్తున్నా మన్నారు. ఇందులో ముఖ్యంగా నానో టెక్నాలజీ ద్వారా రసాయనిక మందులను ద్రవరూపంలో అందించి డ్రోన్ల ద్వారా పిచికారి కొరకు కూడా డ్రోన్లను అద్దె ప్రాతిపదికన రైతులకు అందిస్తున్నామని తెలిపారుపాణ్యం శాసనసభ్యులు కాటసాని రాంభూపాల్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఒక గొప్ప ఆశయంతో రైతులకు ట్రాక్టర్లు, హార్వెస్టర్లను ఇవ్వడం జరిగిందన్నారు. ఈ అవకాశాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. రైతులకు పెట్టుబడి ఖర్చులు తగ్గించి మెరుగైన ఆదాయం అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైయస్సార్ యంత్ర సేవా పథకాన్ని ప్రవేశపెట్టారని తెలిపారు పత్తికొండ శాసనసభ్యులు కంగాటి శ్రీదేవి మాట్లాడుతూ రైతులు విత్తు నుంచి విక్రయం వరకు రైతులకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందించేందుకు గాను రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రైతే రాజు అనే నినాదంతో రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసం ఎన్నో కార్యక్రమాలను రూపొందించిందన్నారుజిల్లా వ్యవసాయ మండలి చైర్మన్ బెల్లం మహేశ్వర రెడ్డి , ఎమ్మెల్యేలు బాలనాగి రెడ్డి, సాయి ప్రసాద్ రెడ్డి, డా.సుధాకర్, హఫీజ్ ఖాన్ మాట్లాడుతూ ప్రభుత్వం రైతన్నకు ప్రతి అడుగులోనూ వెన్నుదన్నుగా నిలుస్తోందన్నారు. రైతాంగాన్ని ఆదుకోవడం కోసం ప్రభుత్వం వైయస్సార్ యంత్ర సేవా పథకం ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. నగర మేయర్ బివై రామయ్య మాట్లాడుతూ సకాలంలో వర్షాలు పడడం వల్ల రైతులు అందరూ సంతోషంగా ఉన్నారన్నారు. వ్యవసాయాన్ని పండుగగా మార్చిన ఘనత ముఖ్యమంత్రి కి దక్కుతుందన్నారు

# టెన్త్ స్టూడెంట్స్ ఫెయిల్ కాదు

**సర్కారు ఫెయిల్యూర్**

**అమ్మ ఒడి, సంక్షేమ పథకాలకి విద్యార్థుల్ని తగ్గించే కుట్ర**

**:-ఎబొూఈ రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డిపోగు బజారన్న**



కర్నూలు జూన్ 07 -: విడుదలైన టెన్త్ ఫలితాల్లో విద్యార్థులు ఫెయిల్ కాలేదని, జగన్ రెడ్డి ప్రభుత్వం విద్యావ్యవస్థని భ్రష్టు పట్టించి పరీక్షల నిర్వహణలో ఫెయిల్ అయ్యిందని ఎబొూఈ రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డిపోగు బజారన్న ఆరోపించారు. టెన్త్ ఫలితాలు విడుదలైన నేపథ్యంలో 71 స్కూళ్లలో ఒక్కరూ ఉత్తీర్ణులు కాకపోవడం, 20 ఏళ్లలో అతి తక్కువగా 67.26 శాతం ఉత్తీర్ణత నమోదు కావడంతో తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ మీడియాకి ప్రకటన విడుదల చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌రెడ్డి తాను పదో తరగతి కష్టపడి చదివి పాసై ఉంటే, విద్యార్థుల కష్టాలు తెలిసేవని ఎద్దేవ చేశారు. పరీక్షలు నిర్వహించడం దగ్గరనుంచి ఫలితాలు ప్రకటించేవరకు అంతా అస్తవ్యస్తం, గందరగోళమేనన్నారు. చదువు చెప్పాల్సిన ఉపాధ్యాయుల్ని నాడు-నేడు పనులకి కాపలా పెట్టడంతో వారు పిల్లలకి చదువు చెప్పడం మానేసి ఈ పనుల్లో నిమగ్నమయ్యారన్నారు. నాడు నేడు అంటూ కోట్ల రూపాయలతో ప్రచారం చేసుకుంటోన్న జగన్‌రెడ్డి 3500 కోట్లు దోచేశారని, నాడు (2018) టిడిపి ప్రభుత్వం నిర్వహించిన టెన్త్ పరీక్షల్లో 94.48 శాతం ఉత్తీర్ణత సాధిస్తే, నేడు 67.26 శాతం దిగజారడమేనా వైసీపీ ప్రభుత్వం సాధించిన ప్రగతి అని ప్రశ్నించారు. బెండపూడిలో పదేళ్లుగా ప్రసాద్ అనే టీచర్ ఎన్నారైల సహకారంతో విద్యార్థినులను అమెరికన్ ఇంగ్లీషులో మాట్లాడేలా తీర్చిదిద్దితే, ఆ ఘనత తన ఖాతాలో వేసుకున్న సీఎం..టెన్త్ దారుణ ఫలితాలు కూడా తన ఖాతాలోనే వేసుకోవాలన్నారు. పాఠాలు చెప్పే ఉపాధ్యాయులను తన మద్యం బ్రాండ్లు అమ్మే షాపులకి కాపలా పెట్టిన సీఎమ్మే దిగజారిన ఫలితాలకు ప్రధాన కారకుడని ఆరోపించారు. పాఠాలు చెప్పే ఉపాధ్యాయుల్ని సీపీఎస్ రద్దు, ఫిట్‌మెంట్ హామీలతో మోసగించడంతో వారు ఆందోళనలతో రోడ్డెక్కి, బోధనకి దూరం చేసింది జగన్ సర్కారే అని మండిపడ్డారు. అధికారంలోకి రాకముందు ప్రతీయేటా మెగా డీయస్సీలో టీచర్ పోస్టులు భర్తీ చేస్తానని హామీ ఇచ్చి తప్పిన సీఎం..ఈ మూడేళ్లలో ఒక్క కొత్త టీచర్‌ని కూడా వేయకపోవడం వల్ల విద్యార్థులకి చదువు చెప్పేవారే లేక ఫలితాలు దారుణంగా వచ్చాయన్నారు. పరీక్షల వేళ విపరీతమైన కరెంటు కోతలు, పరీక్షా సమయం కుదింపు, పేపర్ లీక్, మాల్ ప్రాక్టీస్, మాస్ కాపీయింగ్‌లతో విద్యార్థులు మానసికంగా బాగా దెబ్బతిన్నారని, ఈ కారణాలు కూడా ఫలితాలపై ప్రభావం చూపాయన్నారు. మీడియం గందరగోళం, ఎయిడెడ్ పాఠశాలల రద్దు, పరీక్ష పత్రాల తయారీ విధానంలో లోపాలతో 20 ఏళ్లలో ఎన్నడూ రాని దారుణ ఫలితాలు వచ్చాయని ఆవేదన వ్యక్తం చేశారు. అమ్మ ఒడి ఇవ్వడానికి నిధుల్లేక-అప్పులు దొరక్క ఇప్పటికే వాయిదాలు వేసుకుంటూ వచ్చిన ప్రభుత్వం లబ్ధిదారులను తగ్గించే కుట్రలో భాగంగానే టెన్త్ ఫలితాల్లో అత్యధికుల్ని ఫెయిల్ చేసిందనే అనుమానాలున్నాయన్నారు. టెన్త్ అతి ఎక్కువ మంది పాసైతే అమ్మ ఒడితోపాటు ఇంటర్-పాలిటెక్నిక్‌లో ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వాల్సి వస్తుందని కుట్రతోనే అతి ఎక్కువమందని ఫెయిల్ చేశారని ఆరోపించారు. తెదేపా ప్రభుత్వహయాంలో నిరంతర పర్యవేక్షణ , డీయస్సీలద్వారా టీచర్ల కొరత తీర్చటం , వారికి ప్రమోషన్లు ఇవ్వటం, మెరుగైన పీఆర్సీ ఇవ్వటంవల్ల ఎంతో ఉత్సాహంగా పనిచేసిన టీచర్లు టెన్త్ పరీక్షల్లో ప్రతి సారీ 90 శాతం పైనే ఫలితాలు సాధించడానికి కృషి చేశారని గుర్తు చేశారు. ఫలితాల విడుదలలో జాప్యంతోనే ఆందోళనకి గురయ్యారని, అనుకున్నట్టే ఫలితాలు దారుణంగా వచ్చాయన్నారు. ఒక్కరూ పాస్ కాని పాఠశాలలు 71 ఉన్నాయంటే పరిస్థితి ఎంత దిగజారిపోయిందో అర్థం అవుతోందన్నారు.


# నేడు అంతర్జాతీయ మెదడు కణితి దినోత్సవం

**-:డాక్టర్. ఎన్. సుమంత్ కుమార్**

**కన్సల్టెంట్ న్యూరో సర్జరీ,కిమ్స్ హాస్పిటల్స్, కర్నూలు.**

కర్నూలు జూన్ 07 -: మెదడులో వచ్చే కణితులపై జాగ్రత్త ఉండాలి. వాటిని నిర్లక్ష్యం చేస్తే చాలా ప్రమాదాలు చోటు చేసుకుంటాయి. ప్రజలకు ఈ కణితులపై అవగాహన కల్పించడానికి అంతర్జాతీయ ఆరోగ్య సంస్థ జూన్ 8న వరల్డ్ బ్రెయిన్ ట్యూమర్ డే నిర్వహిస్తున్నారు. ఈ రోజున వివిధ కార్యక్రమాల ద్వారా మెదడు కణితులపై అవగాహన కల్పిస్తారు. ప్రస్తుతం ఉన్న గణాంకాల ప్రకారం ప్రతి లక్ష మందిలో 7 మంది ఈ వ్యాధి బారిన పడుతున్నారని తెలుస్తోంది.1. మెదడు కణితులు అంటే ఏమిటి, అవి ఎన్ని రకాలు ?మెదడులో కణజాలలలో ఏర్పడే ముద్దను మెదడు కణితి అంటారు. ఇవి రెండు రకాలు ప్రైమరీ బ్రెయిన్ ట్యూమర్, సెంకడరీ బ్రెయిన్ ట్యూమర్స్. ప్రైమరీ బ్రెయిన్ ట్యూమర్‌ని నాలుగు విభాగాలుగా విభజించారు. సెకండరీ బ్రెయిన్ ట్యూమర్లు శరీరంలో వివిధ భాగాల్లో సోకుతాయి. అవి రక్తంలో ప్రవేశించి మెదడుకు చేరుతాయి. దీని ద్వారా మెదడులో కణితులు ఏర్పడుతాయి.2. కణితులు ఏర్పడడానిక గల కారణాలు ఏమిటి ?కొన్ని రకాలు రసాయణాలకు పడడం, రేడియేషన్ ఎక్కువ ఉండడం, ఎక్స్‌టీం వైరస్ బారిన పడడం వల్ల ఈ మొదటిది జనరల్ లక్షణాలు, రెండవది ప్రత్యేకమైనది. జనరల్ లక్షణాలు కణితి యొక్క పరిమాణం బట్టి వస్తాయి. తలనొప్పి, వాంతులు, చూపుమందగించడం, ఒత్తిడి పెరగడం, స్పృహ కోల్పోవడం వంటివి. ఇక రెండవది మెదడులో కణితి ఏర్పడిన స్థానం బట్టి వస్తాయి. మెదడు ముందుభాగం, మధ్యభాగం, వెనుక భాగంలో ఆయా స్థానలు బట్టి లక్షణాలు ఉంటాయి. అవి మాటతడబడడం, చూపు మబ్బుగా కనిపించడం, చెవులు వినిపించకపోవడం, మూతి వంకర పోవడం, ఫిట్స్ రావడం, మాట తడబడడం, పక్షవాతం రావడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. అయితే ప్రతి తలనొప్పిని కణితికి కారణం అని చెప్పలేము.

# నజ్రియా ఈ సినిమాను ఒప్పుకోవడమే గొప్ప విషయం: నాని




నాని హీరోగా 'అంటే ..సుందరానికీ' సినిమా రూపొందింది. మైత్రీ మూవీ మేకర్స్ వారు నిర్మించిన ఈ సినిమాకి వివేక్ ఆత్రేయ దర్శకత్వం వహించాడు. వివేక్ సాగర్ సంగీతాన్ని సమకూర్చిన ఈ సినిమాతో కథానాయికగా నజ్రియా పరిచయమవుతోంది. ఈ నెల 10వ తేదీన ఈ సినిమాను విడుదల చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ సినిమా ప్రమోషన్స్ మొదలయ్యాయి. తాజా ఇంటర్వ్యూలో నాని - నజ్రియా పాల్గొన్నారు. నాని మాట్లాడుతూ .. "ఈ సినిమాలో నేను పంచెకట్టుతో కనిపిస్తాను .. చూడ్డానికి చాలా బాగుంటుందిగానీ .. కట్టుకోవడం చాలా కష్టం. ఇక ఒక కథ చెప్పి నజ్రియాను ఒప్పించడం చాలా కష్టం. అయినా వివేక్ ఆత్రేయ తమిళంలో ఆమెకి కథను చెప్పి ఒప్పించాడు. నజ్రియా తెలుగులో ఎప్పుడు ఎంట్రీ ఇస్తుందా అని చాలామంది ఎదురుచూస్తున్నారు.కానీ ఆమె అసలు అందుబాటులో ఉండటమే కష్టం. మలయాళంలోనే ఆమె చాలా కూల్ గా నాలుగేళ్లకు ఒక సినిమా చేస్తారు. ఈ సినిమా కథ వినగానే నాకు హీరోయిన్ నజ్రియా అయితే బాగుంటుందని అనిపించింది. ఎందుకంటే ఆమె చేసిన సినిమాలు కొన్ని నేను చూశాను .. ఆమె యాక్టింగ్ ఎలా ఉంటుందనేది నాకు తెలుసు.ఇంతకుముందు రెండు మూడు సినిమాలకి కూడా నజ్రియా అయితే బాగుంటుందని అనుకున్నాము. కానీ కొన్ని కారణాల వలన కుదరలేదు. ఎందుకం టే తెరపై పాత్ర మాత్రమే కనిపించేలా నటించే ఆర్టిస్టులు అంటే నాకు ఇష్టం.అందువలన అలాంటి పాత్రలతో కూడిన కథలను విన్నప్పుడు ఆమెను గురించి చర్చించుకోవడం జరిగింది. తెలుగు సినిమాలు చేసే ఆలోచన లేదేమోనని వదిలేయడం జరిగింది. ఈ సినిమా విషయానికి వచ్చేసరికి చర్చలతో ఆపకుండా కొంచెం గట్టిగా ట్రై చేయడం జరిగింది. ఇలా ఒక కథ ఉందని చెప్పేసి నేను మెసేజ్ చేయడంతో ఆమె వినేసి ఓకే చేయడం జరిగింది.నా విషయానికి వస్తే .. నేను హీరోను అనే విషయాన్ని పక్కన పెట్టేసి సాధారణమైన ప్రేక్షకుడిగానే కథ వింటాను. అలా వివేక్ ఈ కథ చెబుతూ ఉండగానే చాలా ఎంజాయ్ చేశాను. అప్పటికి ఆయన సెకండాఫ్ రెడీ చేసుకోలేదు .. అయినా ఆయనతో కలిసి పని చేయనున్నట్టు చెప్పేశాను. అందుకు కారణం ఆయన కథను చెప్పే తీరు .. పాత్రలను మలిచే విధానం. నేను ఎప్పుడూ కూడా లంచ్ తరువాత కథలు వినే కార్యక్రమాన్ని పెట్టుకుంటాను. లంచ్ చేసిన తరువాత నిద్ర వస్తుంటుంది. నిద్ర రాకుండా చేసిందంటే అది మంచి కథ అని అర్థం" అంటూ చెప్పుకొచ్చాడు.




# సమ్మర్ సోగ్గాళ్లకు 'మేజర్' టెన్షన్ పట్టుకుందా?

విక్టరీ వెంకటేష్ మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ హీరోలుగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కిన క్రేజీ మల్టీస్టారర్ 'ఎఫ్ 3'. 2019లో విడుదలైన సూపర్ డూపర్ హిట్ 'ఎఫ్ 2'కు సీక్వెల్ గా రూపుదిద్దుకున్న 'ఎఫ్ 3'చిత్రాన్ని శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్ పై దిల్ రాజు శిరీష్ నిర్మించారు. మిల్కీ బ్యూటీ తమన్నా మెహ్రీన్ పిర్జాదా హీరోయిన్లుగా నటించగా.. సోనాల్ చౌహాన్ సునీల్ రాజేంద్ర ప్రసాద్ మురళీ శర్మ తదితరులు ముఖ్య పాత్రలను పోషించారు.భారీ అంచనాల నడుమ మే 27న గ్రాండ్ రిలీజ్ అయిన ఈ ఔట్ అండ్ ఔట్ ఫ్యామిలీ ఎంటర్టైనర్.. ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. కథేమి పెద్దగా లేకపోయినా.. సినిమా మొత్తాన్ని కామెడీ సీన్లతో నింపేశారు. కావాల్సినంత వినోదాన్ని పంచుతుండటంతో ఆడియెన్స్ ఈ మూవీకి బాగానే ఎట్రాక్ట్ అవుతున్నారు. దీంతో వెంకీ-వరుణ్ లు బాక్సాఫీస్ వద్ద అదిరిపోయే కలెక్షన్స్ ను రాబడుతూ దూసుకుపోతున్నారు.తొలి వారం రూ. 48.17 కోట్ల షేర్ రూ. 80.40 కోట్ల గ్రాస్ వసూళ్లను రాబట్టిన సమ్మర్ సోగ్గాళ్లకు.. రెండో వారంలో మాత్రం 'మేజర్' టెన్షన్ పట్టుకునే అవకాశాలు ఎంతైనా ఉన్నాయని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు.మల్టీ ట్యాలెంటెడ్ అడివి శేష్ హీరోగా శశి కిరణ్ తిక్క దర్శకత్వంలో తెరకెక్కిన తాజా చిత్రమే 'మేజర్'. 2008 లో 26/11 ముంబై ఉగ్రవాదుల దాడుల్లో వీరమరణం పొందిన మేజర్ సందీప్ ఉన్నికృష్ణన్ జీవితం ఆధారంగా ఈ మూవీని రూపొందించారు.ఇందులో సయీ మంజ్రేకర్ హీరోయిన్ గా నటించగా.. శోభిత ధూళిపాళ ప్రకాష్ రాజ్ రేవతి మురళి శర్మ తదితరులు కీలక పాత్రలను పోషించారు. జూన్ 3వ తేదీన పాన్ ఇండియా స్థాయిలో రిలీజ్ అయిన ఈ చిత్రం.. తొలి షో నుంచే పాజిటివ్ టాక్ ను సొంతం చేసుకుంది. మరోవైపు కమల్ హాసన్ నటించిన 'విక్రమ్' సైతం నిన్ననే విడుదలై మంచి స్పందన దక్కించుకుంది.దీంతో ఈ రెండు చిత్రాలు బాక్సాఫీస్ వద్ద విధ్వంసం సృష్టించడం ఖాయంగా కనిపిస్తోంది. మరి ఈ రెండు భారీ చిత్రాల మధ్య 'ఎఫ్ 3' ఎంత వరకు నిలబడుతుంది..? ఒకవేళ నిలబడినా బ్రేక్ ఈవెన్ టార్గెట్ ను అందుకుని క్లీన్ హిట్ గా నిలుస్తుందా..? అన్న ప్రశ్నలే వెంకీ వరుణ్ అభిమానులను కలవర పెడుతున్నాయి. కాగా రూ. 64.50 కోట్ల బ్రేక్ ఈవెన్ టార్గెట్ తో బరిలోకి దిగిన సమ్మర్ సోగ్గాళ్లు.. రెండో వారంలో ఏ మేర కలెక్షన్స్ ను రాబడతారో చూడాలి.




# ఆసీస్‌తో మొదటి టీ20.. శ్రీలంక తుది జట్టు ప్రకటన.. విజయం మాదే!



ఆస్ట్రేలియాతో స్వదేశంలో టీ20 సిరీస్‌కు శ్రీలంక క్రికెట్ జట్టు సిద్ధమైంది. కొలంబోలోని ఆర్ ప్రేమదాస స్టేడియం వేదికగా మొదటి టీ20 జరుగనుంది. ఈ క్రమంలో మంగళవారం నాటి(జూన్ 7) మ్యాచ్‌కు శ్రీలంక తమ తుది జట్టును ప్రకటించింది.కాగా 3 టీ20లు, 5 వన్డేలు, 2 టెస్టుల సిరీస్ కోసం కంగారూ జట్టు శ్రీలంకలో పర్యటిస్తోంది. ఇక ఈ ఏడాది ఫిబ్రవరిలో లంక జట్టు ఆస్ట్రేలియాలో పర్యటించిన సంగతి తెలిసిందే. ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ ఆడగా ఆతిథ్య ఆసీస్ జట్టు చేతిలో ఘోర పరాభవం చవిచూసింది.ఆఖరి మ్యాచ్‌లో మాత్రమే గెలుపొంది ఐదింట నాలుగు మ్యాచ్‌లు ఓడిపోయి సిరీస్‌ను ఫించ్ బృందానికి సమర్పించుకుంది. ఈ నేపథ్యంలో ఆసీస్ చేతిలో పరాభవానికి బదులు తీర్చుకోవాలని లంక జట్టు పట్టుదలగా ఉంది. ఈ నేపథ్యంలో కెప్టెన్ దసున్ షనక మాట్లాడుతూ.. "ఐపీఎల్-2022లో మా ఆటగాళ్ల భాగస్వామ్యం కావడంతో కావాల్సినంత ప్రాక్టీసు దొరికింది. ఐపీఎల్ అనుభవం మా జట్టుకు ఉపకరిస్తుంది. బలమైన ఆసీస్ జట్టును ఢీకొట్టేందుకు మేము సిద్ధంగా ఉన్నాము" అని పేర్కొన్నాడు. టీ20 వరల్డ్‌కప్ విజేత ఆస్ట్రేలియాను తప్పకుండా ఓడించి తీరతామని విశ్వాసం వ్యక్తం చేశాడు.

ఆస్ట్రేలియాతో మొదటి టీ20 మ్యాచ్‌కు శ్రీలంక తుది జట్టు:పాథుమ్ నిసాంక, దనుష్క గుణతిలక, చరిత్ అసలంక, కుశాల్ మెండిస్, భనుక రాజపక్స, దసున్ షనక(కెప్టెన్), వనిందు హసరంగ, చమిక కరుణరత్నె, దుష్మంత చమీర, మహీశ్ తీక్షణ, నువాన్ తుషార.

శ్రీలంకతో తొలి టీ20కి ఆస్ట్రేలియా తుది జట్టు

ఆరోన్ ఫించ్(కెప్టెన్), డేవిడ్ వార్నర్, మిచెల్ మార్ష్, గ్లెన్ మాక్స్‌వెల్, స్టీవ్ స్మిత్, మార్కస్ స్టొయినిస్, మాథ్యూ వేడ్(వికెట్ కీపర్), ఆష్టన్ అగర్, మిచెల్ స్టార్క్, కేన్ రిచర్డ్‌సన్, జోష్ హాజిల్‌వుడ్.

**ఐపీఎల్‌లో ఒక్క మ్యాచ్ కూడా ఆడనివ్వలేదు.. అక్కడ మాత్రం దుమ్ము రేపాడు!**

నెదర్లాండ్స్‌తో జరిగిన వన్డే సిరీస్‌ను వెస్టిండీస్ 3-0తేడాతో క్లీన్ స్వీప్ చేసిన సంగతి తెలిసిందే. ఈ సిరీస్‌లో విండీస్ ఆల్‌రౌండర్ కైల్ మైర్స్ అద్భుతంగా రాణించాడు. ఈ సిరీస్‌లో మూడు మ్యాచ్‌లు అతడికి కేవలం రెండు మ్యాచ్‌లలో మాత్రమే బ్యాటింగ్ చేసే అవకాశం వచ్చింది.ఇక నెదర్లాండ్స్‌తో జరిగిన మూడో వన్డేలో మాత్రం మైర్స్ సెంచరీతో చెలరేగాడు. ఇది అతడి కెరీర్‌లో తొలి సెంచరీ కావడం విశేషం. ఈ మ్యాచ్‌లో 106 బంతులు ఎదర్కొన్న మైర్స్ 120 పరుగులు చేశాడు. ఈ సిరీస్‌లో అతడు 142 పరుగులతో పాటు మూడు వికెట్లు కూడా పడగొట్టాడు.ఇది ఇలా ఉండగా.. ఐపీఎల్-2022 మెగా వేలంలో మైర్స్‌ను రూ.50 లక్షలకు లక్నో సూపర్ జెయింట్స్ కొనుగోలు చేసింది.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190